# విశాల భారతి

06-06-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్   సంపుటి:4  సంచిక: 152


నీ పేరు కేసీఆర్ అయితే..

# అసెంబ్లీకి రా!



- కేసీఆర్ నిర్లక్ష్యంతో పాలమూరు ప్రాజెక్టులు ఆగిపోయాయని విమర్శ
- రెండేళ్లలో ప్రాజెక్టుల కోసం రూ. 8,000 కోట్లు కేటాయింపు
- వలసల నివారణకు కొడంగల్‌లో భారీ విద్యా కేంద్రం ఏర్పాటు
- లక్షలాది రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ
- పాలనపై బహిరంగ చర్చకు రావాలని సవాల్
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పూర్తి చేస్తామని భరోసా

03



## కుంభకోణాలకు కేరాఫ్‌గా సింగరేణి


- 40 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు మాయమైనట్లు కేటీఆర్ ఆరోపించారు
- కాగితాలపై బొగ్గు నిల్వలు చూపిస్తూ అక్రమ రవాణాకు పాల్పడ్డారు
- నిల్వలు లేకపోయినా పన్నులు చెల్లిస్తూ దోపిడీకి పాల్పడ్డారని విమర్శ
- గనుల తనిఖీలో కేంద్రం, కాగ్ పర్యవేక్షణ వైఫల్యంపై అనుమానాలు

02

## దేశ సంపదలో తెలంగాణ ర్యాంక్ ఎంత?

దేశ జీడీపీలో 49శాతం వాటా ఈ 5 రాష్ట్రాలదే
మహారాష్ట్ర, తమిళనాడు, యూపీ, కర్ణాటక, గుజరాత్ టాప్
ఐటీ, తయారీ, వ్యవసాయ రంగాల్లో ఈ రాష్ట్రాల ప్రత్యేకత
ఐటీ, ఫార్మా రంగాలతో తెలంగాణ వేగంగా అభివృద్ధి
ఐటీ, వ్యాక్సిన్, ఏరోస్పేస్ హబ్‌గా హైదరాబాద్ కీలకం
దేశాభివృద్ధికి అన్ని రాష్ట్రాల మౌలిక వసతులు అవసరం

02



## తెలంగాణ రేవంత్ జాగీరా?

రేవంత్ ప్రభుత్వంపై ధర్మపురి అర్వింద్ విమర్శ
వైఫల్యాలను కప్పేందుకు పర్యటనపై రాద్ధాంతం
కొనుగోళ్లలో సర్కారు ఘోర వైఫల్యం
రాజకీయ పర్యటనల అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధం
కేంద్రంతో ఘర్షణ వీడి రైతులను ఆదుకోవాలని డిమాండ్

అకాల వర్షాలతో పంట నష్టపోయినా రాజకీయాలకే ప్రాధాన్యత



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణ పర్యటన చుట్టూ ఇప్పుడు రాజకీయ వేడి పీక్ స్టేజ్‌కు చేరింది. ఈ విషయంపై అధికార కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శల పర్వం ఒక ఎత్తయితే, బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందన మరో ఎత్తుగా మారింది. తెలంగాణ రాష్ట్రం ఎవరి సొత్తు కాదనే అర్థం వచ్చేలా ఆయన చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా రేవంత్ రెడ్డికి రాష్ట్రాన్ని ఎవరైనా రాసిచ్చారా అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు పొలిటికల్ కారిడార్లలో హాట్ టాపిక్‌గా మారాయి. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కంటే కూడా అనవసరమైన అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ దృష్టి పెడుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణను రేవంత్ రెడ్డి తన సొంత జాగీరులా భావించడం సరికాదని ధర్మపురి అర్వింద్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ పర్యటన విషయంలో కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆందోళనలు కేవలం ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నాలని ఆయన కొట్టిపారేశారు. ప్రతిపక్షాల పర్యటనలను అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ తమ అసమర్థతను కవర్ చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విశ్లేషించారు. వాస్తవానికి పాలనలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడంలో ప్రభుత్వం విఫలమైందని, అందుకే ఇటువంటి వివాదాలను తెరపైకి తెస్తున్నారని ఆయన మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్ల అంశం ప్రస్తుతం రాష్ట్రంలో అత్యంత సున్నితమైన సమస్యగా మారింది. కేంద్రంతో సఖ్యతగా ఉండి రైతుల ప్రయోజనాలను

మిగతా 2లో..



## తెలంగాణ డబ్బులిస్తేనే ఉచిత ఎంఎంటీఎస్

- రైల్వే బోర్డు ఉచిత ప్రయాణాన్ని నిరాకరించింది
- ఏటా రూ. 160 కోట్ల నష్టం వస్తుందని రైల్వే వెల్లడించింది
- రాష్ట్రం నుంచి రూ. 490 కోట్ల బకాయిలు రావాలి
- ఉచిత ప్రయాణ ఖర్చును రాష్ట్రమే చెల్లించాలి
- రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు భారం పడుతుంది
- ప్రభుత్వం నిధులు ఇస్తేనే పథకం సాధ్యమవుతుంది

04

## నీటి వాటాలో తెలంగాణకు అన్యాయం

- ప్రభుత్వ నిర్లక్ష్యంతో మోటార్లు దెబ్బతిన్నాయి
- పంపుల ఆన్-ఆఫ్ విధానం ప్రాజెక్టులకు ప్రమాదం
- పగటిపూట పంపింగ్ సాగునీటి వ్యవస్థకు నష్టం
- తెలంగాణ హక్కులను కాపాడుకోవడంలో ప్రభుత్వం విఫలం

03





## భూసేకరణ మరింత భారం..!

రిజిస్ట్రేషన్ల ద్వారా ఏటా రూ. 1,500 కోట్ల ఆదాయం
భూమి ధరలు పెరగడంతో సామాన్యులకు సొంత ఇల్లు కష్టమైంది
ప్రాజెక్టుల కోసం రైతులకు ఇచ్చే పరిహారం భారం పెరిగింది
ప్రాజెక్టుల ఎస్టిమేటెడ్ కాస్ట్ పెరిగి ప్రభుత్వానికి ఆర్థిక సవాలు
ఖర్చు తగ్గించుకోవడానికి ల్యాండ్ పూలింగ్ దిశగా సర్కారు యోచన
పరిశ్రమల స్థాపనలో భూమి ఖరీదు పెరిగే అవకాశం

02




## తెలంగాణను వణికిస్తున్న ఎబోలా

- గాంధీ ఆసుపత్రిలో ప్రత్యేక వార్డులు సిద్ధం చేశారు
- కేసు నిర్ధారణ కాగానే రోగిని ప్రత్యేక వార్డుల్లో చేర్చాలి
- వైద్య సిబ్బంది కఠినమైన భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలి
- రోగిని కలిసిన వారిని గుర్తించి పర్యవేక్షించాలి
- వ్యాప్తిని అరికట్టడానికి ప్రభుత్వ నిబంధనలు పాటించాలి
- ఆసుపత్రుల్లో ప్రత్యేక చికిత్సా ఏర్పాట్లు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి

03

# సంగారెడ్డి బీజేపీకి పెద్ది ఎక్కడా..?

దిశానిర్దేశం చేసే వారు కరువయ్యారు
ముఖ్య నేతలు పార్టీ వీడటంతో బలహీనపడింది
అంతర్గత కుమ్ములాటలతో పార్టీ దెబ్బతింటోంది
క్షేత్రస్థాయి బలాన్ని వాడుకోలేకపోతున్నారు
తక్షణ సంస్థాగత మార్పులు అవసరం

03

ఇంచార్జీల నియామకం లేక కార్యకలాపాలు స్తంభించాయి

సంగారెడ్డి జిల్లాలో కమలం పార్టీ పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. పైన పటారం లోన లొటారం అన్న చందంగా జిల్లాలో ఆ పార్టీ తీరు కనిపిస్తోంది. కేంద్రంలో పదేళ్లుగా అధికార పీఠాన్ని అధిష్ఠించిన పార్టీకి, జిల్లా స్థాయిలో గతి లేకుండా పోవడం విడ్డూరంగా మారింది. ఐదు నియోజకవర్గాల్లో కనీసం దిశానిర్దేశం చేసే నాయకుడు లేక కార్యకర్తలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గడచిన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు కొందరు పార్టీని వీడగా, మరికొందరు నిశ్శబ్దంగా ఉండిపోయారు. క్షేత్రస్థాయిలో సంస్థాగత నిర్మాణం కుప్పకూలడంతో పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. ఏ రాజకీయ వ్యూహాలు లేక కేవలం పేపర్లకే పరిమితమైన రాజకీయాలు నడుస్తున్నాయి. పటిష్టమైన పునాది ఉన్నా, నాయకత్వ లోపంతో ఆశావహ దృక్పథం కరువైంది.



# కుంభకోణాలకు కేరాఫ్‌గా సింగరేణి

- 40 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు మాయమైనట్లు కేటీఆర్ ఆరోపించారు
- కాగితాలపై బొగ్గు నిల్వలు చూపిస్తూ అక్రమ రవాణాకు పాల్పడ్డారు
- నిల్వలు లేకపోయినా పన్నులు చెల్లిస్తూ దోపిడీకి పాల్పడ్డారని విమర్శ
- గనుల తనిఖీలో కేంద్రం, కాగ్ పర్యవేక్షణ వైఫల్యంపై అనుమానాలు
- టెండర్ల గోల్‌మాల్, నిధుల దుర్వినియోగం, సీఎస్ఆర్ నిధుల వృథా
- సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని బీఆర్ఎస్ డిమాండ్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు ప్రాణవాయువు లాంటి సింగరేణి కాలరీస్ సంస్థలో వెలుగుచూసిన సంచలన బొగ్గు కుంభకోణం రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. సుమారు 1,600 కోట్ల రూపాయల విలువైన 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు మాయమయ్యాయంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి రాసిన లేఖ ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి సింగరేణి వరుస అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. రాష్ట్ర సంపదను కొల్లగొట్టేలా జరుగుతున్న ఈ భారీ స్కామ్ వెనుక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ప్రయోజనాలు దాగి ఉన్నాయన్న అనుమానాలను ఆయన వ్యక్తం చేశారు. సింగరేణిని పటిష్టం చేయాల్సిన బాధ్యత కలిగిన కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న మతలబు ఏమిటో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణి అధికారిక వెబ్‌సైట్ అందించిన గణాంకాలు ఇప్పుడు సర్వత్రా ఆందోళన కలిగిస్తున్నాయి. ఏప్రిల్ నెలాఖరు వరకు లెక్కల ప్రకారం మందమర్రిలో 7.20 లక్షల మెట్రిక్ టన్నులు, శ్రీరాంపూర్‌లో 8 లక్షల టన్నులు, రామగుండం 1లో 6 లక్షల టన్నులు, రామగుండం 2లో 4 లక్షల టన్నులు, భూపాలపల్లిలో 5.40 లక్షల టన్నులు, ఇల్లందులో 3.50 లక్షల టన్నులు, సత్తుపల్లిలో 2 లక్షల టన్నులు ఇలా మొత్తం సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు అందుబాటులో ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలోని యార్డుల్లో పరిశీలించగా ఈ నిల్వలు ఎక్కడా కనిపించడం లేదు. కాగితాలపై బొగ్గు నిల్వలు చూపిస్తూ కోల్ సెస్, ఆదాయపు పన్ను వంటి భారీ పన్నులు చెల్లించి, వాస్తవానికి బొగ్గును ఎక్కడికి తరలించారో తెలియని అయోమయ స్థితి నెలకొంది. రూ.1,600 కోట్ల విలువైన బొగ్గు ఆవిరైపోవడం అనేది సాధారణ అంశం కాదని, ఇది ప్రభుత్వ యంత్రాంగం కనుసన్నల్లో జరిగిన క్రమబద్ధమైన దోపిడీ అని కేటీఆర్ తన లేఖలో ఘాటుగా స్పష్టం చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఏప్రిల్ నెలలో గనుల తనిఖీ జరగాల్సి ఉన్నప్పటికీ కేంద్ర బొగ్గు గనుల శాఖ బృందాలు గనుల వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం పక్కా ప్లాన్ ప్రకారమే జరిగిందని భావించాల్సి వస్తోంది. కాగ్ అధికారులు కూడా ఇప్పటిదాకా ఎలాంటి తనిఖీలు చేపట్టకపోవడం వెనుక ఉన్న అదృశ్య శక్తులు ఎవరనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. సింగరేణి కార్మికులు సైతం తమ కళ్లముందే సంపద కొల్లగొడుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయని మండిపడుతున్నారు. బొగ్గు అక్రమ రవాణా ద్వారా వచ్చిన ఆదాయం ఎవరి జేబుల్లోకి వెళ్తోంది, ఎవరి ప్రోద్బలంతో ఈ కుంభకోణం సాగుతోంది అనే అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కేటీఆర్ పునరుద్ఘాటించారు. వాస్తవాలను దాచిపెట్టేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వాలకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే అఖిలపక్ష బృందాన్ని రంగంలోకి దింపి గనుల వద్ద వాస్తవ పరిస్థితిని నిరూపించాలని సవాలు విసిరారు. నైని బొగ్గు గని టెండర్లలో జరిగిన గోల్‌మాల్ వ్యవహారం కూడా తాజాగా తెరపైకి వచ్చింది. సైట్ విజిట్ సర్టిఫికేట్ వంటి నిబంధనలను తెరపైకి తెచ్చి, తమకు కావాల్సిన వ్యక్తులకు కాంట్రాక్టులు దక్కేలా చక్రం తిప్పారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్ఎస్ గట్టిగా అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో టెండర్లను రద్దు చేసినా, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైంది. పారదర్శకత మచ్చుకైనా లేని ఈ అక్రమాలకు ఎవరు బాధ్యత వహిస్తారు? కేవలం టెండర్లు రద్దు చేయడమేనా పరిహారం? అంటూ కేటీఆర్ కేంద్రాన్ని నిలదీశారు. 107 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల టెండర్లు, డీజిల్ కొనుగోళ్ల విధానంలో అనుచిత మార్పులు, పేలుడు పదార్థాల కొనుగోళ్లలో మార్కెట్ ధర కంటే అధికంగా చెల్లింపులు జరపడం వంటివి సంస్థను ఆర్థికంగా కుంగదీస్తున్నాయని ఆయన ఆరోపించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల దుర్వినియోగం మరొక దారుణమైన ఉదంతం. సింగరేణి సంస్థను లాభాల బాట పట్టించాల్సిన యాజమాన్యం, కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయాల్సిన నిధులను వృథా చేస్తోంది. ఫుట్‌బాల్ దిగ్గజం మెస్సీతో మ్యాచ్ నిర్వహణ కోసం సంస్థ నిధులను మళ్లించిన తీరు కార్మికులను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సంస్థకు ఎంతో అవసరమైన నిధులను పబ్లిసిటీ కోసం, అనావశ్యక ఖర్చుల కోసం వాడటం యాజమాన్యం వైఖరిని ఎండగడుతోంది. ప్రజల సొమ్ముతో విందులు, వినోదాలు చేసుకుంటూ, సంస్థ అభివృద్ధిని పట్టించుకోని అధికారుల తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. సింగరేణి లాభాలను ప్రజల కోసం, కార్మికుల కోసం కాకుండా స్వార్థపూరిత ప్రయోజనాల కోసం మళ్లించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఈ కుంభకోణాలపై విచారణ జరగకపోతే బీఆర్ఎస్ ఉద్యమాన్ని ఉధృతం చేస్తుంది. తెలంగాణ ఆస్తిని, గర్వకారణమైన సింగరేణి సంస్థను కాపాడుకునే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని కేటీఆర్ హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక పునాదులను దెబ్బతీసే కుట్రలను ప్రజల సమక్షంలో బయటపెడతామని స్పష్టం చేశారు. కార్మికుల హక్కులను హరించి, సంస్థను బలహీనపరుస్తూ సాగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తం చేయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతను విస్మరిస్తే ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించిన కేటీఆర్, అక్రమాలకు పాల్పడిన ప్రతి ఒక్కరినీ విచారణ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సింగరేణిని బతికించుకోవాల్సిన చారిత్రక బాధ్యత ఇప్పుడు ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన నొక్కి చెప్పారు. చెప్పాలంటే, సింగరేణిలో జరుగుతున్న ఈ వరుస అవినీతి ఉదంతాలు వ్యవస్థలోని లోపాలను కళ్లకు కడుతున్నాయి. కేవలం రాజకీయ ఆరోపణలుగా కాకుండా, ఈ వ్యవహారాన్ని లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. సుమారు 1,600 కోట్ల బొగ్గు నిల్వలు మాయం కావడం అనేది చిన్న విషయం కాదు. దీనిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాల్సిన బాధ్యత పాలక వర్గాలపై ఉంది. లేనిపక్షంలో సింగరేణి కష్టజీవుల అసహనం పెద్ద ఉద్యమంగా మారి ప్రభుత్వ పునాదులను కదిలించే అవకాశం ఉంటుంది. కాలం నిర్ణయించే ఈ విచారణ ప్రక్రియ, సింగరేణి భవిష్యత్తును నిర్ణయించబోతోంది. వాస్తవాలు నిగ్గుతేల్చి, దోషులను చట్టం ముందు నిలబెట్టాలని తెలంగాణ సమాజం కోరుకుంటోంది.

## ప్రభుత్వ భూమి కబ్జా కుట్ర భగ్నం

**సూత్రధారి బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్**



**సైబరాబాద్ విశాల భారతి:** గండిపేట మండలం సర్వే నెం.18లోని సుమారు 10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసి రెగ్యులరైజేషన్ చేయించుకునేందుకు నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు, తప్పుడు రెవెన్యూ రికార్డులు సృష్టించిన ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న బొల్లా బ్రహ్మనాయుడిని తమిళనాడులోని కాంచీపురం ప్రాంతంలో నార్సింగి పోలీసులు, సైబరాబాద్ ఈవోడబ్ల్యూ అధికారులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. గండిపేట మండలంలో నగర శివారున ఉన్న ఈ భూమి విలువ వందల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. ఈ భూమిపై కన్నేసిన బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ, నిమ్మల కుటుంబ సభ్యులు పరస్పరం కుమ్మక్కై కుట్ర పన్నారు. ప్రభుత్వ భూమిపై అక్రమ హక్కులు సృష్టించేందుకు నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు, తప్పుడు అధికారిక పత్రాలు, రికార్డులు తయారు చేశారు. గండిపేట తహసీల్దార్ ఎన్.శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఏడాది మే 23న నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు నమోదైన తర్వాత పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దర్యాప్తులో భాగంగా నార్సింగి పోలీసులు, ఈవోడబ్ల్యూ అధికారులు ఇప్పటికే నిమ్మల కుటుంబ సభ్యులు, రాధాకృష్ణ, అతని డ్రైవర్ ప్రభీన్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా తదుపరి విచారణ నిమిత్తం పోలీస్ కస్టడీ మంజూరైంది. కస్టడీలో విచారణ జరుగుతుండగానే కేసులోని మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రభుత్వ భూమిపై హక్కులు సృష్టించేందుకు బొల్లా బ్రహ్మనాయుడు సుమారు రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిపినట్లు దర్యాప్తులో తేలింది. ఇందులో నిమ్మల కుటుంబ సభ్యులకు రూ.4 కోట్లు, ఇప్పటికే అరెస్టైన రాధాకృష్ణకు రూ.4 కోట్లు, ఇతర సంబంధిత వ్యక్తులకు మరో రూ.4 కోట్లు చెల్లించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ డబ్బును నకిలీ జీవోలు, నకిలీ ప్రభుత్వ అనుమతులు, తప్పుడు పత్రాల తయారీ ద్వారా భూమిపై అక్రమ హక్కులు సృష్టించేందుకు వినియోగించినట్లు తేలింది. కేసులో తన పేరు రాగానే బొల్లా బ్రహ్మనాయుడు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశాడు. అయితే కేసు తీవ్రత, దర్యాప్తు ప్రారంభ దశలో ఉండడం, పోలీసులు సమర్పించిన ప్రాథమిక ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న గౌరవ హైకోర్టు అతని బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. బెయిల్ దొరక్కపోవడంతో బొల్లా బ్రహ్మనాయుడు పరారీలోకి వెళ్లాడు. పరారీలో ఉన్న అతన్ని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలు, సెల్‌ఫోన్ టవర్ లొకేషన్లు, నిఘా సమాచారం ఆధారంగా తమిళనాడులోని కాంచీపురం ప్రాంతంలో అతని ఆచూకీ గుర్తించి శుక్రవారం అరెస్ట్ చేశారు. ప్రస్తుతం బొల్లా బ్రహ్మనాయుడు పోలీసుల అదుపులో ఉన్నాడు. చట్టపరమైన ప్రక్రియ ప్రకారం గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నారు. ఈ కేసులో ఆర్థిక లావాదేవీల మూలాలు, నకిలీ పత్రాల తయారీకి ఉపయోగించిన ముద్రలు, ప్రభుత్వ అధికారుల పేర్లు, సంతకాల దుర్వినియోగం, కుట్రలో పాల్గొన్న ఇతర వ్యక్తుల పాత్రలపై దర్యాప్తు కొనసాగుతోంది. మిగిలిన నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

# భూ సేకరణ మరింత భారం..!


**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ ప్రభుత్వం తాజాగా ప్రకటించిన భూముల మార్కెట్ విలువ పెంపు నిర్ణయం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపేలా కనిపిస్తోంది. రిజిస్ట్రేషన్ శాఖలో ఆదాయాన్ని భారీగా పెంచుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ సవరణలు రియల్ ఎస్టేట్ రంగాన్ని ఊపందుకునేలా చేస్తాయని ఉన్నతాధికారులు గట్టిగా నమ్ముతున్నారు. జూన్ 5 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి వచ్చిన ఈ కొత్త ధరల వల్ల స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా ఏటా రూ. 1,500 కోట్ల మేర అదనపు ఆదాయం ప్రభుత్వ ఖజానాకు చేరుతుందని ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. ప్రభుత్వం ఈ పెంపును బహిరంగ మార్కెట్ ధరలకు అనుగుణంగానే సర్దుబాటు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. ఆర్థిక నిపుణులు సూచించినట్లుగా కొన్ని చోట్ల 30 శాతం, మరికొన్ని ప్రాంతాల్లో 100 శాతం వరకు పెరిగిన విలువలు రియల్టర్లకు, కొనుగోలుదారులకు ఒకేసారి పెద్ద షాక్‌ను ఇస్తున్నాయి. మార్కెట్ ట్రెండ్స్‌ను బట్టి ఐటీ కారిడార్ వంటి కీలక ప్రాంతాల్లో ధరలు ఆకాశాన్ని తాకుతుండటంతో మధ్యతరగతి ప్రజలకు భూమిని సొంతం చేసుకోవడం మరింత కష్టతరంగా మారుతోంది. ప్రభుత్వం ఆదాయం కోసం వేసిన ఈ అడుగు మరోవైపు ప్రాజెక్టుల భూసేకరణ విషయంలో పెద్ద తలనొప్పిగా మారుతోంది. తెలంగాణలో రాబోయే ఫ్యూచర్ సిటీ, గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైల్ సెకండ్ ఫేజ్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు వేల ఎకరాల భూమి అవసరం ఉంది. భూ సేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వం నిర్దేశించిన మార్కెట్ విలువను బట్టే రైతులకు, భూ యజమానులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పుడు ప్రభుత్వం తన వంతుగా భూముల విలువను పెంచేయడంతో ఆటోమేటిక్‌గా చెల్లించాల్సిన పరిహారం మొత్తం కూడా పెరిగిపోతోంది. గ్రామీణ ప్రాంతాల్లో రెండు నుంచి నాలుగు రెట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు రెట్ల మేర పరిహారం చెల్లించాలనే నిబంధనలు సర్కారుకు ఆర్థికంగా భారంగా పరిణమిస్తున్నాయి. రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే రూ. 1,500 కోట్ల అదనపు ఆదాయం ప్రాజెక్టుల కోసం చేసే భూసేకరణ ఖర్చుతో పోలిస్తే చాలా తక్కువగా ఉంటుందనేది ఆర్థిక వేత్తల వాదన. దీనివల్ల ప్రాజెక్టుల ఎస్టిమేటెడ్ కాస్ట్ భారీగా పెరిగి మొత్తం బడ్జెట్ అంచనాలు తారుమారయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ప్రధానంగా గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టు ఈ మార్పుల వల్ల అత్యంత ప్రభావితం కానుంది. ఈ రహదారి కోసం ప్రభుత్వం ప్రాథమికంగా రూ. 4,600 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసింది. ఇప్పటికే 447 ఎకరాల భూసేకరణ పాత ధరల ప్రకారం పూర్తయినప్పటికీ ఇంకా 558 ఎకరాలను సేకరించాల్సి ఉంది. కొత్తగా పెరిగిన ధరల ప్రకారం ఈ మిగిలిన భూమిని సేకరించాలంటే మరో రూ. 350 కోట్ల నుంచి రూ. 500 కోట్ల వరకు అదనపు భారం ఖజానాపై పడుతోంది. మహేశ్వరం, కందుకూరు, ఆమనగల్ వంటి ప్రాంతాల్లో భూ ధరలు అంచనాలకు మించి పెరగడం ఈ అదనపు వ్యయానికి ప్రధాన కారణం. ఇదే పరిస్థితి రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించి కూడా తలెత్తుతోంది. చౌటుప్పల్, షాద్‌నగర్, సంగారెడ్డి పరిసరాల్లో భూసేకరణ బడ్జెట్ కనీసం 25 శాతం పెరిగే అవకాశం ఉంది. మెట్రో రైల్ సెకండ్ ఫేజ్ కారిడార్లలోనూ పట్టణీకరణ వేగంగా జరుగుతున్నందున భూమి విలువలు ఊహించని రీతిలో పెరిగాయి. భూసేకరణ వ్యయం పెరగడంతో ప్రభుత్వం తన ఆర్థిక లక్ష్యాలను ఎలా చేరుకోవాలో తెలియక సతమతమవుతోంది. ఒక పక్క అభివృద్ధి ప్రాజెక్టులు ఆగిపోకూడదు, మరోపక్క భూసేకరణకు అయ్యే భారీ ఖర్చును భరించలేక ప్రభుత్వం సతమతమవుతోంది. ఈ పరిస్థితులను అధిగమించడానికి ల్యాండ్ పూలింగ్ అనే పాత ఫార్ములాను తెరపైకి తెచ్చే యోచనలో ఉన్నట్లు సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రభుత్వ భూములను సేకరించడానికి బదులుగా రైతులకు భూమిని ఇమ్మని కోరి, అందుకు ప్రతిఫలంగా అభివృద్ధి చేసిన లేఅవుట్లలో ప్లాట్లు ఇవ్వడం ఈ విధానం ప్రధాన ఉద్దేశ్యం. అమరావతి రాజధాని నగర నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేసిన ఈ ల్యాండ్ పూలింగ్ పద్ధతిని తెలంగాణలో కూడా ఫ్యూచర్ సిటీ లేదా ఇతర కీలక ప్రాజెక్టుల కోసం వాడాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇది అమలులోకి వస్తే రైతులకు ప్లాట్ల రూపంలో మెరుగైన ప్రయోజనం లభించవచ్చు, అలాగే ప్రభుత్వానికి భూసేకరణ వ్యయం కూడా తగ్గుతుంది. రియల్ ఎస్టేట్ రంగంలో ధరలు విపరీతంగా పెరగడం వల్ల కొత్తగా భూమిని కొనేవారికి ఇప్పుడున్న ధరలతో అంచనాలు పూర్తిగా తలకిందులవుతున్నాయి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నట్లుగా, ఇప్పటికే బహిరంగ మార్కెట్ లో ధరలు ఎక్కువగా ఉన్న చోట ప్రభుత్వం రేట్లను పెంచడం వల్ల కొంత బ్యాలెన్స్ అవుతుందనే వాదన ఉన్నా, అది సాధారణ ప్రజల పాలిట భారంగానే మారింది. ముఖ్యంగా ఐటీ కారిడార్, ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో ల్యాండ్ వ్యాల్యూ భారీగా పెరగడంతో అక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకుందామనే వారి ఆశలకు గండి పడుతోంది. పెట్టుబడిదారులు, పెద్ద డెవలపర్లకు ఇది ఆశాజనకమే కావొచ్చు కానీ సొంత ఇల్లు కట్టుకోవాలనుకునే మధ్యతరగతి వర్గాలకు మాత్రం ఇది మింగుడుపడని నిర్ణయంగా మారింది. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ల ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో చేస్తున్న ఈ ప్రయత్నాలు సామాన్య పౌరుడి బడ్జెట్‌ను కూడా ప్రభావితం చేస్తున్నాయనేది వాస్తవం. మౌలిక వసతుల ప్రాజెక్టులు వేగవంతం కావాలంటే భూసేకరణ అడ్డంకులు తొలగిపోవాలి. అయితే పెరుగుతున్న మార్కెట్ విలువలతో భూసేకరణే పెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం ఇండస్ట్రియల్ పార్కుల కోసం టీజీ ఐఐసీ ద్వారా సేకరించే భూముల వ్యయం కూడా పెరుగుతుండటంతో పారిశ్రామికంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి భూమి ఖరీదు పెరిగే అవకాశం ఉంది. టీజీ ఐఐసీ భూమిని ఖరీదైన ధరకే కొనుగోలు చేసి పారిశ్రామిక వేత్తలకు కేటాయించాల్సి వస్తుంది. ఇది పరోక్షంగా తెలంగాణలో కొత్త పరిశ్రమల స్థాపనపై ప్రభావం చూపుతుంది. ప్రాజెక్టుల నిర్మాణంలో నాణ్యత, వేగం తగ్గకుండా ఉండాలంటే ప్రభుత్వం భూసేకరణ వ్యయాన్ని సమర్థవంతంగా నిర్వహించాల్సి ఉంటుంది. కేవలం రిజిస్ట్రేషన్ ఆదాయం మీద మాత్రమే ఆధారపడకుండా, ప్రాజెక్టుల వ్యయ నియంత్రణకు కొత్త మార్గాలను అన్వేషించక తప్పదు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఒక కత్తి మీద సాము లాంటిది. రిజిస్ట్రేషన్ శాఖలో పెరుగుతున్న ఆదాయం పన్నుల వసూలులో సక్సెస్ అనిపించినా, ప్రాజెక్టుల కోసం జేబులోంచి చెల్లించాల్సిన అదనపు భారం ఖజానాపై ఒత్తిడిని పెంచుతోంది. భూముల విలువ పెంచడం ద్వారా రియల్ ఎస్టేట్ రంగానికి బూస్ట్ వస్తుందనే అంచనాలు ఒకవైపు, మౌలిక వసతుల కల్పనలో పెరుగుతున్న వ్యయం మరోవైపు సర్కారును ఊగిసలాటలో ఉంచుతున్నాయి. భవిష్యత్తులో ఈ ఆర్థిక సవాళ్లను ఎలా ఎదుర్కొంటుంది అన్నదే అసలు ప్రశ్న. ల్యాండ్ పూలింగ్ వంటి ప్రత్యామ్నాయ వ్యూహాలు ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్లడానికి ఎంతవరకు సహాయపడతాయో వేచి చూడాలి.

# దేశ సంపదలో తెలంగాణ ర్యాంక్ ఎంత?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**






భారతదేశ ఆర్థిక ప్రగతి అడుగులు దేశవ్యాప్తంగా సమానంగా పడటం లేదు. కొన్ని కీలక రాష్ట్రాల చుట్టే వృద్ధి రేటు బలంగా కేంద్రీకృతమై ఉందనేది వాస్తవం. రెండు వేల ఇరవై అయిదు-ఇరవై ఆరు ఆర్థిక సంవత్సరానికి అంచనా వేసిన స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి లెక్కలను పరిశీలిస్తే, దేశ ఆర్థిక వ్యవస్థను కేవలం అయిదు రాష్ట్రాలు ముందుండి నడిపిస్తున్నట్లు స్పష్టమవుతోంది. మన దేశ జాతీయ స్థూల దేశీయోత్పత్తి అంచనా సుమారు మూడు వందల యాభై ఏడు లక్షల పద్నాలుగు వేల కోట్ల రూపాయలు కాగా, అందులో దాదాపు నలభై తొమ్మిది శాతం అంటే నూట డెబ్బై ఆరు లక్షల ఐదు వేల కోట్ల రూపాయలు కేవలం అయిదు రాష్ట్రాల నుంచే వస్తుండటం గమనార్హం. జాతీయ సంపద సృష్టిలో ఈ రాష్ట్రాలు పోషిస్తున్న పాత్ర దేశాభివృద్ధికి కీలకంగా మారింది. మహారాష్ట్ర దేశంలోనే అత్యధికంగా నలభై తొమ్మిది లక్షల ముప్పై తొమ్మిది వేల కోట్ల రూపాయల స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తితో ప్రథమ స్థానంలో నిలిచింది. జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఈ రాష్ట్ర వాటా సుమారు పన్నెండు నుండి పదమూడు శాతం వరకు ఉంది. ముంబై కేంద్రంగా నడిచే సేవారంగం, దేశంలోకి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులలో సుమారు ముప్పై తొమ్మిది శాతం వాటా ఇక్కడి ఆర్థిక వ్యవస్థకు ప్రధాన బలాలు. పారిశ్రామికంగా, ఆర్థికంగా అగ్రస్థానంలో కొనసాగుతూ ఈ రాష్ట్రం దేశ వృద్ధికి ఇంధనంగా పనిచేస్తోంది. ఆర్థిక కేంద్రంగా ముంబై నగరం ప్రస్థానం దేశవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను ఆకర్షిస్తూనే ఉంది. పారిశ్రామికంగా, పట్టణీకరణలో తమిళనాడు అగ్రగామిగా ఎదుగుతోంది. ఆటోమొబైల్స్ రంగంలో చెన్నై నగరం ఆసియా డెట్రాయిట్‌గా పేరుగాంచగా, వస్త్ర పరిశ్రమ, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాల్లో రాష్ట్రం దూసుకుపోతోంది. మూడు ప్రధాన ఓడరేవులను కలిగి ఉండటం ద్వారా బలమైన ఎగుమతుల వ్యవస్థను సొంతం చేసుకుంది. దేశం మొత్తంలో తయారీ రంగ వాటాలో ఈ రాష్ట్రం కీలక పాత్ర పోషిస్తోంది. పారిశ్రామిక వృద్ధికి అనువైన విధానాలు అమలు చేయడంలో తమిళనాడు ముందు వరుసలో నిలుస్తోంది. ఎగుమతుల రంగంలో తమిళనాడు సాధిస్తున్న పురోగతి జాతీయ స్థాయిలో విశ్లేషకుల ప్రశంసలు అందుకుంటోంది. ఉత్తరప్రదేశ్ అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రమైనప్పటికీ, వ్యవసాయ రంగంపై ఆధారపడటం నుంచి తయారీ రంగం వైపు వేగంగా అడుగులు వేస్తోంది. భారీ ఎక్స్‌ప్రెస్‌వేలు, రక్షణ రంగ కారిడార్లు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల విస్తరణతో ఈ రాష్ట్రం ఆర్థిక వృద్ధిని వేగవంతం చేస్తోంది. మ్యానుఫ్యాక్చరింగ్ రంగంలో రాష్ట్రం తీసుకుంటున్న నిర్ణయాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. దేశంలోనే అతిపెద్ద వినియోగదారుల మార్కెట్‌గా ఉండటం యూపీకి కలిసివస్తున్న అంశం. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం పెడుతున్న ఖర్చు రాబోయే రోజుల్లో మరింత వృద్ధిని తీసుకురానుంది. కర్ణాటక ఐటీ, సాఫ్ట్‌వేర్, స్టార్టప్ ఎకోసిస్టమ్ ద్వారా దేశ సాంకేతిక రాజధానిగా గుర్తింపు పొందింది. బెంగళూరు కేంద్రంగా నడుస్తున్న ఐటీ ఎగుమతులు రాష్ట్ర జీఎస్డీపీలో సింహభాగం వాటాను కలిగి ఉన్నాయి. ఐటీ రంగానికి తోడు బయోటెక్నాలజీ, ఏరోస్పేస్ తయారీలోనూ ఈ రాష్ట్రం అగ్రగామిగా కొనసాగుతోంది. గ్లోబల్ టెక్ దిగ్గజాలకు కేంద్రంగా ఉండటం వల్ల నిరంతరం పెట్టుబడులు ఇక్కడికి వస్తూనే ఉన్నాయి. నూతన ఆవిష్కరణలకు చిరునామాగా మారుతూ కర్ణాటక దేశ ఆర్థిక ప్రగతిలో బలమైన భాగస్వామిగా ఎదుగుతోంది. గుజరాత్ దేశ మొత్తం ఎగుమతులలో ముప్పై ఒక్క శాతం, పారిశ్రామిక ఉత్పత్తిలో పద్దెనిమిది శాతం వాటాతో తయారీ రంగానికి గేట్‌వేగా నిలుస్తోంది. రసాయనాలు, పెట్రోకెమికల్స్, ఫార్మా, వజ్రాల శుద్ధి రంగాలలో ఈ రాష్ట్రానిదే ఆధిపత్యం. పారిశ్రామిక పార్కుల ఏర్పాటు, ఓడరేవుల అభివృద్ధి ఈ రాష్ట్ర వృద్ధిని గణనీయంగా పెంచాయి. వ్యాపార అనుకూల వాతావరణాన్ని కల్పించడంలో గుజరాత్ తీసుకుంటున్న చర్యలు అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నాయి. దేశ ఎగుమతుల రంగానికి వెన్నెముకగా నిలుస్తూ గుజరాత్ తన సత్తా చాటుతోంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన అతి తక్కువ కాలంలోనే దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలిచింది. పద్దెనిమిది లక్షల కోట్ల రూపాయల అంచనా జీఎస్డీపీతో జాతీయ ఆర్థిక వ్యవస్థలో ఐదు శాతం వాటాను కలిగి ఉండి తొమ్మిదవ స్థానంలో సత్తా చాటుతోంది. హైటెక్ సేవలు, వ్యవసాయ రంగాల మధ్య సమతుల్యతను సాధిస్తూ రాష్ట్రం ఈ మైలురాయిని చేరుకుంది. హైదరాబాద్ నగరం ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించే కేంద్రంగా మారి ఆర్థిక వృద్ధికి చోదక శక్తిగా పనిచేస్తోంది. మౌలిక వసతుల కల్పనలో వేగం, పారిశ్రామిక విధానాలు రాష్ట్ర పురోగతిని వేగవంతం చేస్తున్నాయి. హైదరాబాద్ ఐటీ హబ్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ కేంద్రంగా కర్ణాటక తర్వాత అత్యధిక ఐటీ, ఐటీ ఆధారిత సేవలను ఎగుమతి చేస్తున్న రెండో అతిపెద్ద రాష్ట్రంగా తెలంగాణ ఎదిగింది. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి గ్లోబల్ దిగ్గజాలకు హైదరాబాద్ అమెరికా బయట అతిపెద్ద కార్యాలయాలు నిర్వహించే నగరంగా మారింది. అలాగే ప్రపంచ వ్యాక్సిన్ సరఫరాలో అత్యధిక భాగం ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతుండటంతో హైదరాబాద్‌ను వ్యాక్సిన్ రాజధానిగా పిలుస్తారు. భారత్ బయోటెక్, బయోలాజికల్ వంటి దిగ్గజ సంస్థలతో పాటు జీనోమ్ వ్యాలీ ద్వారా ఫార్మా రంగంలో లీడర్‌గా కొనసాగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా బీడు భూములు సస్యశ్యామలమవ్వడం వ్యవసాయ వృద్ధికి ప్రధాన కారణమైంది. మెరుగైన సాగునీరు, రైతులకు అందుతున్న మద్దతుతో వరి, పత్తి ఉత్పత్తిలో దేశంలోని టాప్ రాష్ట్రాల సరసన నిలిచింది. వ్యవసాయంతో పాటు ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగంలోనూ హైదరాబాద్ కీలక హబ్‌గా మారింది. లాక్‌హీడ్ మార్టిన్, బోయింగ్ వంటి అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు రంగం విస్తరణకు దోహదపడ్డాయి. నగరం విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పనతో రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ రంగం భారీగా పుంజుకుని జీఎస్డీపీ వృద్ధికి గణనీయంగా తోడ్పడుతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థ రాబోయే కాలంలో పటిష్టంగా మారాలంటే ఈ రాష్ట్రాల వృద్ధిని మరింతగా వేగవంతం చేయాల్సి ఉంటుంది. ప్రాంతీయ అసమానతలు తొలగిపోయి, అన్ని రాష్ట్రాలు ఆర్థికంగా స్వయం సమృద్ధిని సాధించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆర్థిక కేంద్రాలుగా ఉన్న నగరాలకు తోడుగా ద్వితీయ శ్రేణి నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వాలు దృష్టి సారిస్తే రానున్న దశాబ్దాల్లో భారతదేశం ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదగడం ఖాయంగా కనిపిస్తోంది. వృద్ధిలో దూసుకెళ్తున్న రాష్ట్రాల నమూనాలను అనుసరిస్తూ మిగిలిన రాష్ట్రాలు కూడా ఆర్థిక పురోగతి సాధించాల్సిన సమయం ఆసన్నమైంది.

# తెలంగాణ రేవంత్ జాగీరా?

**మొదటిపేజీ తరువాయి**



కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా ఫెయిల్ అయ్యిందని అర్వింద్ ఆరోపణలు చేశారు. లారీల కొరత అనే సాకుతో రైతులకు తీరని నష్టం చేస్తున్నారని ఆయన వాదించారు. సరైన సమయానికి ధాన్యం సేకరణ చేపట్టి ఉంటే, నేడు అకాల వర్షాలకు రైతులు ఈ కష్టాలు పడేవారే కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం వల్లే ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆయన విమర్శించారు. వ్యవసాయ విధానంపై కనీస అవగాహన లేకుండా రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారని అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒక ముఖ్యమంత్రిగా క్షేత్రస్థాయిలో ఉన్న రైతుల ఇబ్బందులను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని, కానీ ఆ దిశగా చర్యలు లేవని ఆయన అభిప్రాయపడ్డారు. అకాల వర్షాలతో పంట తడిసిపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నా, అధికార యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న ఇటువంటి ప్రాథమిక సమస్యలను పక్కనపెట్టి, కేవలం రాజకీయ ఆధిపత్యం కోసం ప్రయత్నించడం దారుణమని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నేతలు పవన్ కల్యాణ్ పర్యటనకు మద్దతు ఇవ్వడం వెనుక ఉన్న ఉద్దేశ్యం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎక్కడైనా పర్యటించే స్వేచ్ఛ ఉందని, దాన్ని అడ్డుకోవడం రాజ్యాంగ విరుద్ధమని వారు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ స్వేచ్ఛను హరించే ప్రయత్నం చేయడం వల్లనే విపరీతమైన వ్యతిరేకత ఎదుర్కొంటోంది. పవన్ కల్యాణ్ పర్యటనను అడ్డుకోవాలని ప్రయత్నించడం ద్వారా కాంగ్రెస్ తన ఓటమిని తానే ఖాయం చేసుకుంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పేరుతో పర్యటనలను నియంత్రించాలని చూడటం ప్రభుత్వానికి తగదని వారు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం అత్యంత కీలకం. కానీ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంతో నిరంతరం ఘర్షణ వైఖరినే అవలంబిస్తోంది. కేంద్ర పథకాలను రాష్ట్రంలో అమలు చేయడంలో జరుగుతున్న ఆలస్యం వల్ల నష్టపోయేది సామాన్య ప్రజలేనని గుర్తుంచుకోవాలి. ధాన్యం కొనుగోళ్ల విషయంలో కూడా కేంద్ర నిధులు వాడుకోవడంలో ప్రభుత్వం సకాలంలో స్పందిస్తే ఇన్ని ఇబ్బందులు ఉండేవి కావు. రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల జీవితాలతో ఆటలాడటం ఆపాలని బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి పవన్ కల్యాణ్ పర్యటనను కాంగ్రెస్ ఒక అస్త్రంగా వాడుకుంటోంది. ఎప్పుడూ లేని విధంగా ఒక పర్యటనపై ఇంతటి రాద్ధాంతం ఎందుకనేది ఇప్పుడు సామాన్యుల మెదళ్లను తొలిచే ప్రశ్న. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ సర్కార్ చిత్తశుద్ధిని శంకించేలా పరిస్థితి ఉంది. అర్వింద్ చేసిన వ్యాఖ్యలు బీజేపీ స్టాండ్‌ను మరింత బలోపేతం చేశాయి. త్వరలోనే ఈ వ్యవహారం ఇంకాస్త రచ్చగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. అకాల వర్షాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ప్రభుత్వ అప్రమత్తత లోపం ఇప్పుడు ప్రధాన అజెండాగా మారింది. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిపోవడం అన్నదాతకు కోలుకోలేని దెబ్బ. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలను గమనించి, తక్షణమే ధాన్యం సేకరణ పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కేంద్రం నిధులిచ్చినా, లారీల కొరత వంటి సాకులు చెప్పి కాలయాపన చేయడం ఏమిటనేది రైతుల నుంచి వస్తున్న ప్రధాన ప్రశ్న. రైతు కష్టాలను తీర్చడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందనే వాదన బలంగా వినిపిస్తోంది.

- ప్రభుత్వ నిర్లక్ష్యంతో మోటార్లు దెబ్బతిన్నాయి
- పంపుల ఆన్-ఆఫ్ విధానం ప్రాజెక్టులకు ప్రమాదం
- పగటిపూట పంపింగ్ సాగునీటి వ్యవస్థకు నష్టం
- తెలంగాణ హక్కులను కాపాడుకోవడంలో ప్రభుత్వం విఫలం
- ప్రాజెక్టుల నిర్వహణలో సర్కారు ప్రేక్షకపాత్ర
- 24 గంటల విద్యుత్, ప్రాజెక్టుల ఆధునీకరణ అవసరం

# నీటి వాటాలో తెలంగాణాకు అన్యాయం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర సాగునీటి రంగం ప్రస్తుతం అగమ్యగోచర స్థితిలో పడిపోయింది. అన్నదాతల కళ్లలో ఆనందం చూసేందుకు నిర్మించిన ప్రాజెక్టులు నేడు నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతున్నాయి. కాళేశ్వరం, దేవాదుల వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల నిర్వహణలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పట్ల బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాసిన బహిరంగ లేఖ ద్వారా ఆయన ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. పదేపదే హెచ్చరించినా పట్టించుకోని అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వల్లే నేడు మోటార్లు దెబ్బతిన్నాయని ఆయన ఆరోపించారు. రాష్ట్ర జల హక్కులు పక్కా ప్లానింగ్ లోపంతో తీవ్ర ప్రమాదంలో పడ్డాయని ఆయన కుండబద్దలు కొట్టారు. గత ఏప్రిల్ 7వ తేదీన ఇరిగేషన్ మంత్రికి రాసిన లేఖలో హరీశ్ రావు ముందే పసిగట్టారు. భారీ సామర్థ్యం ఉన్న మోటార్లను నిరంతరం ఆన్, ఆఫ్ చేయడం ఎలక్ట్రోమెకానికల్ ఎక్విప్‌మెంట్‌పై తీవ్ర ఒత్తిడి పెంచుతుందని ఆయన అప్పట్లోనే వివరించారు. ఈ ప్రక్రియ వల్ల షాఫ్ట్‌లు, బేరింగ్స్ దెబ్బతింటాయని ఆయన హెచ్చరించారు. సాంకేతిక లోపాలను సరిదిద్దాల్సింది పోయి ప్రభుత్వం తనదైన శైలిలో వ్యవహరించడం వల్లే నేడు కాళేశ్వరం ప్రాజెక్టులోని గాయత్రి పంపింగ్ స్టేషన్ పంపులు మొరాయించాయి. దేవాదుల వంటి కీలక లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులలో కూడా భారీ నష్టం సంభవించింది. సాంకేతిక పరిజ్ఞానం లేని నిర్ణయాలు తీసుకుని ఇప్పుడు పంపుల మరమ్మతులకు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేయడం విడ్డూరంగా ఉంది. సోలార్ పవర్ ఆధారంగా పగటిపూట మాత్రమే పంపులు నడపాలని ట్రాన్స్‌కో సూచించడం వెనుక ఉన్న మతలబు ఏమిటో ప్రభుత్వానికే తెలియాలి. ఇందుకోసం ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం.8 ప్రాజెక్టుల మనుగడకే ముప్పుగా మారింది. విద్యుత్ పొదుపు పేరుతో చేస్తున్న ఈ కసరత్తు సాగునీటి వ్యవస్థను కుప్పకూల్చే దిశగా సాగుతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరాయంగా పంపులు నడిపితేనే తెలంగాణ సస్యశ్యామలం అవుతుంది. ఇటువంటి ఆచరణ సాధ్యం కాని విధానాల వల్లే పంపులకు నష్టం వాటిల్లితే దానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించక తప్పదు. ప్రజల ఆశలను వమ్ము చేస్తూ తీసుకుంటున్న ఇటువంటి నిర్ణయాలు క్షేత్రస్థాయిలో పెను సవాళ్లను విసురుతున్నాయి. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. కృష్ణా వాటర్ డిస్ప్యూట్స్ ట్రిబ్యునల్ తాత్కాలిక ఏర్పాట్ల ప్రకారం మనకు 34 శాతం, ఏపీకి 66 శాతం వాటా ఉంది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ నీటి వినియోగం చారిత్రక కనిష్ట స్థాయికి పడిపోయింది. 202425లో ఏపీ తన వాటాకు మించి 72.73 శాతం నీటిని వాడుకుంటే తెలంగాణ కేవలం 27.27 శాతం మాత్రమే వినియోగించుకోగలిగింది. ఇది రాష్ట్ర అధికార యంత్రాంగం పనితీరుకు పరాకాష్ట. నీటి హక్కులను కాపాడుకోవడంలో విఫలమై, ప్రాజెక్టులను నిర్వీర్యం చేయడం ద్వారా తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని ఆయన మండిపడ్డారు. 202526 నాటికి పరిస్థితి మరింత దిగజారింది. ఏపీ వాడకం ఏకంగా 74.90 శాతానికి పెరగగా తెలంగాణ వినియోగం 25.10 శాతానికి పడిపోయింది. నీరు పుష్కలంగా ఉన్నా సరైన ప్రణాళికలు లేకపోవడం వల్లే రాష్ట్రం దగా పడుతోంది. పక్కా వ్యూహంతో కృష్ణా జలాలను మన వాటా మేరకు వాడుకోవడంలో ప్రభుత్వం ఎందుకు వెనకడుగు వేస్తుందో అర్థం కావడం లేదు. సాగునీటి రంగంలో కనిపిస్తున్న ఈ వైఫల్యాలు రైతుల ఆందోళనకు కారణమవుతున్నాయి. ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న అశ్రద్ధ భవిష్యత్తులో తెలంగాణ సాగునీటి రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేలా ఉంది. బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్న ప్రధానాంశం ఏంటంటే, సాగునీటి వ్యవస్థకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి. పంపింగ్ సీజన్‌లో కరెంట్ కోతలు లేకుండా చూస్తేనే రైతుల పంటలు పండుతాయి. లేదంటే పంపులు ఆగిపోయి, పంటలు ఎండిపోయి రైతులు రోడ్డున పడాల్సి వస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రైతు డిస్కం కాన్సెప్ట్ అసలు అశాస్త్రీయమైనది. వ్యవసాయానికి, సాగునీటి రంగానికి ముప్పుగా మారే ఈ డిస్కం విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి. ఇలాంటి ప్రయోగాలు రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయాలు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉండాలి తప్ప కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఉండకూడదు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటాను వంద శాతం వాడుకోవడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలి. రాష్ట్ర నీటి హక్కుల సాధన కోసం ప్రభుత్వం పట్టుదలగా వ్యవహరించాలి. కేంద్రంతో పోరాడి అయినా సరే మనకు రావలసిన నీటిని తెచ్చుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. ప్రతి సీజన్‌లో నీటి కొరత లేకుండా చూసుకోవడం ద్వారానే రైతులకు భరోసా కల్పించగలం. లేని పక్షంలో సాగునీటి ప్రాజెక్టుల వల్ల ప్రయోజనం శూన్యం. చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయిన నీటి వినియోగం రికార్డులను చూస్తుంటే ప్రభుత్వానికి రైతుల పట్ల ఎంత నిబద్ధత ఉందో అర్థమవుతోంది. నిధుల కేటాయింపులో కూడా ప్రభుత్వం విఫలమవుతోంది. కాళేశ్వరం, దేవాదుల వంటి భారీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణకు నిరంతరం నిధులు అవసరం. ఆధునీకరణ పేరుతో అరకొర నిధులు ఇచ్చి ప్రాజెక్టులను గాలికి వదిలేయడం సరికాదు. బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టుల కోసం తగినంత నిధులు కేటాయించాలి. యంత్రాల మరమ్మతుల కోసం నిధుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి రాకూడదు. పంపులు, మోటార్ల వంటి కీలక యంత్రాలకు ఎప్పటికప్పుడు మెయింటెనెన్స్ చేయాలి. పాతబడిన యంత్రాలను మార్చి ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలి. అప్పుడే ప్రాజెక్టులు సమర్థవంతంగా పనిచేస్తాయి. సాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు రాష్ట్ర ప్రగతిని దెబ్బతీస్తున్నాయి. కాలానుగుణంగా వాతావరణ మార్పులను, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని అడుగులు వేయాలి. హరీశ్ రావు లేఖలో పేర్కొన్న అంశాలు ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిని కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. ప్రభుత్వం తక్షణం స్పందించి, తప్పులను సరిదిద్దుకుని, పారదర్శకమైన విధానాలను అమలు చేయాలి. రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీటి సరఫరాను మెరుగుపరచాలి. లేదంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడి అన్నదాతల మేలు కోసం పనిచేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. తెలంగాణ సాగునీటి రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ప్రస్తుత పాలకులు క్షేత్రస్థాయి వాస్తవాలను గుర్తించి నిర్ణయాలు తీసుకోవాలి. ప్రాజెక్టుల పట్ల చూపుతున్న నిర్లక్ష్యం భవిష్యత్తులో తెలంగాణను ఎడారిగా మార్చే ప్రమాదం ఉంది. రైతు డిస్కం వంటి అనవసరమైన ప్రయోగాలు మానుకుని, విద్యుత్ సరఫరాపై దృష్టి సారించాలి. ప్రతి చుక్క నీటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారానే బంగారు తెలంగాణ కల సాకారమవుతుంది. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం సాగునీటి ప్రాజెక్టులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# తెలంగాణను వణికిస్తున్న ఎబోలా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఎబోలా వైరస్ అనే పేరు వినగానే ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరిలోనూ ఒక రకమైన వణుకు పుడుతుంది. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో ప్రత్యేక వార్డులు సిద్ధం చేయడం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం ప్రజల భద్రతను నిర్ధారించడం. ఈ వైరస్ పుట్టుక గురించి మాట్లాడుకుంటే, 1976 సంవత్సరంలో ఆఫ్రికాలోని ఎబోలా నది పరివాహక ప్రాంతంలో ఇది మొదటిసారిగా వెలుగులోకి వచ్చింది. అప్పటి నుండి ఈ వైరస్ ప్రపంచ ఆరోగ్య సంస్థకు ఒక సవాలుగా మారుతూనే ఉంది. ఎబోలా అంటే కేవలం ఒక సాధారణ జ్వరం కాదు, ఇది ప్రాణాంతకమైన హెమరేజిక్ ఫీవర్ లేదా రక్తస్రావ జ్వరానికి కారణమయ్యే వైరల్ ఇన్ఫెక్షన్. ఈ వ్యాధి సోకిన వారిలో మరణాల రేటు అత్యంత భయంకరంగా, అంటే 25 శాతం నుండి 90 శాతం వరకు నమోదు కావడం గమనార్హం. ఆధునిక కాలంలో వైరస్ల వేగం మరియు వ్యాప్తికి సంబంధించి మనం చాలా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది, అందుకే దీని గురించి శాస్త్రీయమైన అవగాహన కలిగి ఉండటం ప్రతి ఒక్కరి బాధ్యత. గాలి ద్వారా వ్యాపించే వైరస్ల గురించి మనకు తెలుసు కానీ, ఎబోలా వాటికి భిన్నమైనది. ఇది గాలి ద్వారా అస్సలు వ్యాపించదు, కానీ సోకిన వ్యక్తితో ప్రత్యక్ష సంబంధం ఏర్పడితే మాత్రం చాలా వేగంగా విస్తరిస్తుంది. ప్రధానంగా బాధితుల రక్తం, లాలాజలం, చెమట, మూత్రం, వాంతులు, విసర్జన పదార్థాల ద్వారా ఈ వైరస్ ఆరోగ్యవంతులకు చేరుతుంది. అలాగే వైరస్ సోకిన జంతువులైన కోతులు, చింపాంజీలు, గబ్బిలాల వంటి అడవి జంతువులతో సన్నిహితంగా ఉండటం, వాటి మాంసాన్ని సేవించడం కూడా ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వైరస్ శరీరంలోకి ప్రవేశించిన వెంటనే లక్షణాలు కనిపించవు. ఇన్క్యుబేషన్ పీరియడ్ అంటే వైరస్ సోకిన సమయం నుండి లక్షణాలు బయటపడే వరకు 2 నుండి 21 రోజుల సమయం పడుతుంది. ఈ సుదీర్ఘ కాలం ఎబోలాను గుర్తించడంలో పెద్ద అడ్డంకిగా మారుతుంది, ఎందుకంటే బయటకు సాధారణంగా కనిపించే వ్యక్తిలో కూడా వైరస్ పొంచి ఉండే అవకాశం ఉంటుంది. ప్రారంభ దశలో ఎబోలా లక్షణాలను సాధారణ జ్వరంగా పొరబడే ప్రమాదం ఉంది. అకస్మాత్తుగా వచ్చే జ్వరం, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పులు, కీళ్ల నొప్పులు, విపరీతమైన అలసట, గొంతు నొప్పి వంటి సమస్యలతో ప్రారంభమవుతుంది. యువత, మధ్య వయస్సు వారు ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేసే అవకాశం ఉంది, కానీ ఎబోలా విషయంలో ఏమాత్రం అజాగ్రత్త వహించినా పరిస్థితి చేయిదాటిపోతుంది. కొన్ని రోజుల పాటు ఈ లక్షణాలు కొనసాగిన తర్వాత, వ్యాధి తీవ్రత పతాక స్థాయికి చేరుకుంటుంది. విషమించిన సమయంలో విపరీతమైన వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి, చర్మంపై దద్దుర్లు రావడం సర్వసాధారణం. మన శరీరంలోని ముఖ్యమైన అవయవాలైన కాలేయం, మూత్రపిండాల పనితీరు దెబ్బతినడం మొదలవుతుంది. వైరస్ వ్యాప్తి పెరిగే కొద్దీ రోగి శరీరం లోపలి నుండి బలహీనపడటం మొదలై, ప్రాణాంతక పరిస్థితులకు దారితీస్తుంది. తీవ్రమైన కేసులలో పరిస్థితి మరింత భయానకంగా ఉంటుంది. ముక్కు, నోటి నుండి రక్తం కారడం, వాంతుల్లో, మలంలో రక్తం కనిపించడం వంటివి ఎబోలా వ్యాధి యొక్క భయంకరమైన సంకేతాలు. అంతర్గత రక్తస్రావం జరగడం వల్ల రోగి శరీర వ్యవస్థలు ఒక్కొక్కటిగా విఫలమవుతాయి.




ఈ దశలో చికిత్స అందించడం వైద్యులకు కూడా ఒక సవాలుగా మారుతుంది. అయితే ఎబోలా లక్షణాలు మలేరియా, టైఫాయిడ్, మెనింజైటిస్ వంటి సాధారణ వ్యాధులతో పోలి ఉంటాయి కాబట్టి, రోగికి ఖచ్చితంగా ఎబోలానే సోకిందని నిర్ధారించడానికి ప్రత్యేక ప్రయోగశాల పరీక్షలు అవసరమవుతాయి. ప్రస్తుత కాలంలో అందుబాటులో ఉన్న ఆధునిక వైద్య పరీక్షల ద్వారా త్వరగా నిర్ధారణ చేయడం, ఆ వెంటనే ఐసోలేషన్ ప్రక్రియ ప్రారంభించడం ద్వారా ఇతర ఆరోగ్యవంతులకు వైరస్ వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవడం చాలా కీలకం. ఎబోలాకు అన్ని రకాల వైరస్ రకాలను ఒకేసారి నిర్మూలించే సంపూర్ణ ఔషధం లేదా చికిత్స ప్రస్తుతం అందుబాటులో లేదు. ఇది ఆందోళన కలిగించే అంశమే అయినా, వైద్య శాస్త్రం నిరంతరం కృషి చేస్తోంది. అయితే రోగికి సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా కోలుకునే అవకాశాలు పెంచవచ్చు. ప్రధానంగా బాధితులకు శరీరంలోని ద్రవాలు తగ్గకుండా చూసుకోవడం, ఓఆర్ఎస్ ఇవ్వడం, సెలైన్ ఎక్కించడం వంటి సపోర్టివ్ కేర్ చాలా అవసరం. లక్షణాలకు అనుగుణంగా మందులు ఇవ్వడం, శరీర రోగనిరోధక శక్తిని పెంచే చర్యలు తీసుకోవడం ద్వారా రోగి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంది. వైద్యం ఎంత త్వరగా ప్రారంభిస్తే రోగి జీవించే అవకాశాలు అంత ఎక్కువగా ఉంటాయి. మనం చేసే చికిత్స వైరస్ను పూర్తిగా చంపకపోయినా, రోగి శరీరం వైరస్తో పోరాడటానికి తగినంత సమయం, శక్తిని అందిస్తుంది. ప్రస్తుతం ఎబోలా వైరస్లోని కొన్ని రకాలపై టీకాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా ఆరోగ్య సిబ్బంది, వైరస్ ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసే ముందువరుస యోధుల కోసం ఈ టీకాలు ఒక కవచంలా పనిచేస్తాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా ఎబోలా వైరస్లో రకరకాల స్ట్రెయిన్లు ఉండటం వల్ల, అన్నింటికీ ఒకే టీకా పని చేయదు. పరిశోధనలు కొనసాగుతున్నాయి, రాబోయే రోజుల్లో మరింత ప్రభావవంతమైన టీకాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. వైరస్ ఎప్పుడు, ఎలా రూపాంతరం చెందుతుందో ఎవరూ ఊహించలేరు కాబట్టి, టీకాలపైనే పూర్తిగా ఆధారపడకుండా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం, అనుమానిత లక్షణాలు ఉన్న వారిని దూరంగా ఉంచడం వంటి జాగ్రత్తలు మనం తప్పనిసరిగా తీసుకోవాలి. ఇది బాధ్యతాయుతమైన పోరుడిగా మనందరి కర్తవ్యం. తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న ఈ ముందస్తు చర్యలు అభినందనీయం. హైదరాబాద్‌లో ప్రత్యేక ఐసోలేషన్ వార్డుల ఏర్పాటుతో ఎబోలా గురించి భయాందోళన చెందాల్సిన అవసరం లేదు. వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి అవసరమైన ప్రోటోకాల్లను రాష్ట్ర ఆరోగ్య శాఖ కఠినంగా అమలు చేస్తోంది. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను నమ్మకుండా, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే అనుసరించాలి. పరిశుభ్రత పాటించడం, జంతువులతో అపరిచిత సంబంధాలకు దూరంగా ఉండటం, అనుమానిత లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం వంటి జాగ్రత్తలు మనల్ని, మన సమాజాన్ని రక్షిస్తాయి. ఎబోలా వంటి ప్రాణాంతక వైరస్ల పట్ల అవగాహన పెంచుకోవడం ద్వారానే మనం అప్రమత్తంగా ఉండి, ఆరోగ్యవంతమైన తెలంగాణను నిర్మించుకోగలం.

# నీ పేరు కేసీఆర్ అయితే.. అసెంబ్లీకి రా!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జడ్చర్ల వేదికగా సాగిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక బహిరంగ సభ తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో సరికొత్త ప్రకంపనలు సృష్టించింది. పాలమూరు గడ్డపై అడుగుపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యర్థులపై విమర్శల జడివాన కురిపించారు. వలసల కష్టాలు, ఆత్మహత్యల నష్టాలు అనుభవించిన ఈ నేలపై గత పదేళ్లలో జరిగిన అన్యాయాలను ఆయన కళ్లకు కట్టినట్లు వివరించారు. రాజకీయ వలస వచ్చిన కేసీఆర్ పాలమూరును ఏ విధంగా విస్మరించారో, ప్రాజెక్టుల విషయంలో ఎన్ని డ్రామాలు ఆడారో గణాంకాలతో సహా ఎండగట్టారు. జిల్లా గడ్డపై తనకున్న అనుబంధాన్ని, ఈ ప్రాంత అభివృద్ధికి తనకున్న నిబద్ధతను చాటుతూ ప్రతిపక్షాల కుట్రలను చీల్చిచెండాడారు. పదేళ్ల పాటు ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కేసీఆర్ చేతిలో పెడితే, జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయకుండా అన్యాయం చేశారని మండిపడ్డారు. పాలమూరులో గెలిచిన నాయకుడు గజ్వేల్‌కు పారిపోవడం ద్రోహం కాదా అని ఆయన నిలదీశారు. గత పాలకుల నిర్లక్ష్యంతో ఉద్దండపూర్ ప్రాజెక్టు నిర్వాసితులు నానా ఇబ్బందులు పడుతుంటే, కనీసం 800 కోట్ల రూపాయలు కూడా ఇచ్చే మనసు లేకపోయిందని ఆరోపించారు. న్యాయం కోరిన వారిని జైలు పాలు చేసిన దుర్మార్గ పాలన అంతమైందని ఆయన స్పష్టం చేశారు. మట్టికి పోయినా మనోడే పోవాలన్న పెద్దల మాటను గుర్తుచేస్తూ, పాలమూరు బిడ్డగా కేవలం 30 నెలల కాలంలోనే 8,000 కోట్ల రూపాయలు జిల్లా ప్రాజెక్టుల కోసం ఖర్చు చేశానని లెక్కలు వివరించారు. జిల్లాలో వలసలు శాశ్వతంగా ఆగిపోవాలంటే చదువు ఒక్కటే మార్గమని నమ్మి, కొడంగల్‌లో భారీ విద్యా కేంద్రం (ఎడ్యుకేషన్ హబ్) నిర్మిస్తున్నామని ఆయన వెల్లడించారు. బీఆర్ఎస్ నాయకులు జైళ్లు కట్టాలని ఆలోచిస్తే, తాము పేద విద్యార్థుల కోసం స్కూళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. కేసీఆర్ ప్రభుత్వానికి, తమ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. రెండున్నరేళ్ల తమ పాలనలో 15,00,000 కొత్త రేషన్ కార్డులు అందించడం జరిగిందని చెప్పారు. 4,50,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి పేదలకు సొంత గూడు కల్పించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. 50,00,000 కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తూ భారాలను తగ్గిస్తున్నామని గుర్తుచేశారు. మహిళల ప్రయాణ సౌకర్యం కోసం 10,000 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ, వారి ఆత్మగౌరవాన్ని పెంచామని ఆయన వివరించారు. అభివృద్ధి గురించి మాట్లాడాలంటే రామాయణమంత పెద్ద గ్రంథం అవుతుందని, అంతలా తమ ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. ఈ



సందర్భంగా కేసీఆర్‌కు నేరుగా సవాల్ విసురుతూ, తన పదేళ్ల పాలనపై, తమ రెండున్నరేళ్ల పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా అని అడిగారు. అసెంబ్లీ సాక్షిగా చర్చకు రావాలని, ఒకవేళ తమది తప్పని తేలితే క్షమాపణ చెప్పేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. నిన్నమొన్నటి వరకు అక్రమాలకు పాల్పడిన వారు ఇప్పుడు పాదయాత్రలంటూ డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. పాదయాత్రలు కాదు కదా, కాశీ దాకా పొర్లుదండాలు పెట్టినా చేసిన పాపాలు తొలగిపోవని రేవంత్ రెడ్డి తీవ్రంగా వ్యాఖ్యానించారు. పంచె కట్టుకుని ఊళ్లలోకి వస్తే ప్రజలు ఉరికించి కొడతారని, పద్ధతి మార్చుకోకుంటే ఫలితం దారుణంగా ఉంటుందని హెచ్చరించారు. పాలమూరు ప్రజలకు మట్టి తీయడం మాత్రమే కాదు, అన్యాయం చేసే వారిని మట్టిలో కలిపేయడం కూడా తెలుసని గుర్తుచేశారు. భవిష్యత్తులో ఈ జిల్లాలో మీ పార్టీని బొంద పెడతామని, ఒక్క ఎమ్మెల్యేను కూడా గెలవనివ్వమని స్పష్టం చేశారు. గడిచిన పదేళ్లలో అధికారంలో ఉన్న వారు చేసిన తప్పుల వల్లనే జిల్లాకు ఈ గతి పట్టిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి జలాల విషయంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దాగుడుమూతలు ఆడుతున్నారని, బీజేపీ నాయకులు ఇక్కడ తప్పించుకు తిరుగుతున్నారని రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా తుమ్మిడిహెట్టి కట్టి తీరుతామని, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీల నీటిని ఒప్పించే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు మంజూరు చేసి జిల్లా ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తామని ప్రకటించారు. పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తి చేయడం తన ప్రాధాన్యత అని, దీనివల్ల వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టుల వల్ల జిల్లాలోని ప్రతి ఎకరం పచ్చబడుతుందని ఆయన ఆకాంక్షించారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని, ప్రతి చుక్క నీటిని జిల్లాకు తీసుకువస్తానని ఆయన మాటిచ్చారు. గత పాలకులు నీటి ప్రాజెక్టులను కేవలం కమిషన్ల కోసం వాడుకున్నారని, తాము మాత్రం ప్రజల అవసరాల కోసం ఖర్చు చేస్తున్నామని వివరించారు. జిల్లా అభివృద్ధి కోసం కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై కూడా గట్టిగా పోరాడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో 2034 వరకు కాంగ్రెస్ పార్టీదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధిని ఆపే శక్తి ఎవరికీ లేదని, ప్రజల ఆశీస్సులతోనే ముందుకు వెళ్తున్నామని చెప్పారు. రాబోయే 2029 ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపిస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అప్పటి వరకు రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతాయని హామీ ఇచ్చారు. పాలమూరు గడ్డ కాంగ్రెస్ కంచుకోటగా మారుతుందని, ఇక్కడ ప్రతిపక్షాలకు చోటు లేదని ఆయన స్పష్టం చేశారు. పేదరికం లేని సమాజం కోసం, సామాజిక న్యాయం కోసం నిరంతరం శ్రమిస్తామని ఆయన హామీ ఇచ్చారు. తన మాటలను ప్రజలు నమ్మాలని, రాబోయే ఐదేళ్లలో జిల్లా అభివృద్ధిని మీరు కళ్లారా చూస్తారని చెప్పారు. పథకాల అమలులో ఎలాంటి అక్రమాలు జరగకుండా చూస్తున్నామని, లంచాలకు తావులేని పాలన అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే తమ ప్రథమ కర్తవ్యమని, దీని కోసం ఎంతటి కష్టానికైనా సిద్ధమని తెలిపారు. రాజకీయాల కోసం కాకుండా, రాష్ట్రాన్ని ఉన్నత స్థానంలో నిలిపేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కేసీఆర్ లాంటి స్వార్థపూరిత రాజకీయాలకు ప్రజలు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు. తమ పాలనలో ప్రతి ఒక్కరికి మేలు జరుగుతుందని ఆయన భరోసా ఇచ్చారు. ప్రతి పథకం అర్హులైన వారికే చేరుతుందని నమ్మకం కలిగించారు. రేవంత్ రెడ్డి జైర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్ అనే నినాదంతో సభలో ఉన్న వేలాది మంది ప్రజల్లో ఉత్సాహం నింపారు. రాబోయే కాలంలో జిల్లాను మరింత ప్రగతి పథంలో తీసుకెళ్తామని మరోసారి హామీ ఇచ్చారు. పాలమూరు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగానే తమ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. సభకు వచ్చిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలుపుతూ, కాంగ్రెస్ పార్టీ విజయ యాత్ర కొనసాగుతుందని ఆయన ప్రకటించారు. సభలో ఉన్న ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ అభివృద్ధికి మద్దతుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభతో కేసీఆర్ భ్రమలు తొలగిపోయాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

# సంగారెడ్డి బీజేపీకి 'పెద్ది' ఎక్కడా..?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

సంగారెడ్డి, పఠాన్‌చెరు, జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో బీజేపీ ఓటు బ్యాంకు రోజురోజుకూ క్షీణిస్తోంది. 2023 ఎన్నికల సమయంలో హడావుడి చేసిన అభ్యర్థులు ఇప్పుడు కనుమరుగయ్యారు. సంగారెడ్డి నుండి పోటీ చేసిన పులిమామిడి రాజు ఎన్నికల ముగిసిన వెంటనే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో టికెట్ ఆశించి వచ్చిన రాంచందర్ రాజనర్సింహ ఇప్పుడు పార్టీ కార్యకలాపాలకు సుదూరంగా ఉంటున్నారు. బాబుమోహన్ వంటి సీనియర్ నేతలు సైతం అందోల్‌లో ఓటమి తర్వాత రాజీనామా చేసి వెళ్లిపోయారు. పార్టీకి విధేయులుగా ఉంటారని నమ్మిన వారు సైతం కనీస బాధ్యత తీసుకోకపోవడం గమనార్హం. జిల్లా రాజకీయాల్లో జరుగుతున్న ఈ మార్పులు అధిష్టానం కళ్లకు కట్టినట్లు కనిపిస్తున్నా స్పందన శూన్యం. నారాయణఖేడ్ అభ్యర్థి సంగప్ప బాధ్యతారాహిత్యం కార్యకర్తలను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. నియోజకవర్గంలో ఆయన అడుగుపెట్టిన దాఖలాలు లేవు, పార్టీ కార్యక్రమాలను అసలే పట్టించుకోవడం లేదు. పఠాన్‌చెరులో మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్ గౌడ్ ఓటమి తర్వాత కాషాయం పార్టీకి పూర్తి దూరమయ్యారు. ఎన్నికల బరిలో నిలిచిన నేతలు ఒక్కొక్కరుగా పక్కకు తప్పుకోవడం వల్ల



క్యాడర్ గందరగోళంలో పడింది. ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకతను ఎండగట్టే నాయకుడే లేక నిరసన కార్యక్రమాలు కూడా అరకొరగా సాగుతున్నాయి. పార్టీని నమ్ముకున్న చిన్న స్థాయి కార్యకర్తలు ఆత్మరక్షణలో పడిపోయారు. జిల్లా మొత్తం ఏ నాయకుడు కూడా గొంతు ఎత్తలేని పరిస్థితి నెలకొంది. భౌగోళికంగా, సామాజికంగా సంగారెడ్డి జిల్లా బీజేపీకి ఎంతో అనుకూలమైన ప్రాంతం. సరిహద్దులోని జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో కర్ణాటక తరహా సంస్కృతి, సాంప్రదాయాలు బలంగా ఉంటాయి. మఠాలు, ఆశ్రమాలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతాల్లో హిందూ ఓట్ల ఏకీకరణకు ఆస్కారం ఉంది. కానీ అటువంటి బలమైన పునాదిని వాడుకునే ప్రణాళికలు ఏవి కూడా అమలు చేయడం లేదు. సరైన నాయకత్వం లేకపోవడం వల్ల ఆ ఓటు బ్యాంకు వేరే పార్టీల పాలవుతోంది. గెలుపు అవకాశాలు పుష్కలంగా ఉన్నా, వాటిని సద్వినియోగం చేసుకోవడంలో నేతలు విఫలమయ్యారు. ఇప్పటికైనా రాజకీయ వ్యూహాలను మార్చుకుంటేనే భవిష్యత్తులో పుంజుకునే అవకాశం ఉంటుంది. పఠాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల్లో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ వేగంగా జరుగుతోంది. అక్కడ స్థిరపడిన ఉత్తర భారత ఓటర్లు, మధ్యతరగతి ప్రజలు బీజేపీని ఆదరించే అవకాశం ఎక్కువగా ఉంది. ఇంతటి అనుకూలతలు ఉన్నా, నాయకత్వ వైఫల్యం పార్టీ ఎదుగుదలకు పెద్ద ప్రతిబంధకంగా మారింది. మున్సిపల్, సర్పంచ్ ఎన్నికల్లో గతాన్ని మించిన ఫలితాలు సాధించలేక చతికిలబడ్డారు. గతంలో బలమైన అభ్యర్థులు ఉన్నప్పుడు ప్రజలు ఆదరించిన తీరును నేతలు మర్చిపోయారు. మెదక్ పార్లమెంట్ స్థానంలో రఘునందన్ రావు సాధించిన విజయం, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి గెలుపు పార్టీకి ఇక్కడ ఉన్న బలానికి నిదర్శనాలు. ఆ ఉత్సాహాన్ని కొనసాగించలేక పార్టీ చతికిలపడటం బాధాకరం. అధిష్టానం సంగారెడ్డి జిల్లాపై కనీస దృష్టి సారించడం లేదు. అసెంబ్లీ ఎన్నికలు జరిగి రెండేళ్లు దాటినా ఇప్పటికీ నియోజకవర్గ ఇంచార్జీలను కూడా నియమించలేదు. క్షేత్రస్థాయిలో పార్టీకి పెద్దదిక్కు లేక కార్యకర్తలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. రాష్ట్ర నాయకత్వం కూడా జిల్లా వ్యవహారాలను పూర్తిగా పక్కన పెట్టేసింది. కనీసం సమీక్షా సమావేశాలు జరపడం కానీ, లోపాలను సరిదిద్దే ప్రయత్నం కానీ చేయడం లేదు. దీంతో పార్టీలో బాధ్యతారాహిత్యం పెరిగిపోయింది. కేంద్రం అధికారంలో ఉన్నప్పటికీ, స్థానికంగా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే నాథుడే లేడు. అధిష్టానం నిర్లక్ష్యం కింది స్థాయి కార్యకర్తల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తోంది. పార్టీ నేతల మధ్య సమన్వయం లేకపోవడం మరో ప్రధాన సమస్యగా మారింది. గ్రూపు రాజకీయాలు పెరిగిపోయి కార్యకర్తలు వర్గాలుగా విడిపోయారు. జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డిపై పలువురు అసహనంతో ఉన్నట్లు చర్చ సాగుతోంది. ఆ వర్గపోరు పార్టీ ప్రతిష్టను, ఉనికిని మసకబారుస్తోంది. బలమైన నాయకత్వం లేకపోవడం వల్ల గ్రూపుల గొడవలు రోడ్డుపైకి వస్తున్నాయి. దీనివల్ల సాధారణ ప్రజలకు పార్టీపై నమ్మకం తగ్గుతోంది. కార్యకర్తలను ఐక్యం చేయాల్సిన వారే వర్గాలకు మద్దతు ఇవ్వడంతో గందరగోళం పెరుగుతోంది. ఈ అంతర్గత కుమ్ములాటలు పార్టీని మరింత బలహీనపరుస్తున్నాయి. నిజానికి క్షేత్రస్థాయిలో ఉన్న కింది స్థాయి కార్యకర్తల్లో ఇప్పటికీ పట్టుదల ఉంది. ఏదైనా ఉద్యమం చేయాలన్నా, నిరసన తెలపాలన్నా కార్యకర్తలు సిద్ధంగానే ఉన్నారు. కానీ వారికి దిశానిర్దేశం చేసే వారు, సమన్వయం చేసే వారు కరువయ్యారు. పార్టీ ఆఫీసులకు వెళ్లినా స్పష్టమైన ఆదేశాలు లేక కార్యకర్తలు నిరాశతో వెనుదిరుగుతున్నారు. రాజకీయం అంటే కేవలం ఎన్నికల టైమ్‌లో మాత్రమే కాదు, నిరంతరం ప్రజల్లో ఉండాలని వారికి తెలిసినా నాయకులు వినిపించుకోవడం లేదు. కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభించకపోవడం వల్ల చాలామంది సైలెంట్ అయ్యారు. పార్టీ కోసం పనిచేసే వారికి సరైన వేదిక దొరకడం లేదు. జిల్లా రాజకీయాల్లో బీజేపీ ఇప్పుడు ఒక శూన్యంలోకి వెళ్తోంది. గతం నుండి పాఠాలు నేర్చుకోకపోతే పార్టీ ఉనికి పడిపోవడం ఖాయం. వెంటనే నియోజకవర్గ ఇంచార్జీలను నియమించి, సంస్థాగత నిర్మాణం చేపట్టాలి. సీనియర్, జూనియర్ కార్యకర్తల మధ్య సమన్వయం పెంచేలా కార్యక్రమాలు రూపొందించాలి. గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి అందరూ కలిసి పనిచేసేలా నాయకత్వం చర్యలు తీసుకోవాలి. క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమయ్యే నాయకులను ముందుంచాలి. ప్రభుత్వం తీసుకువస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపడితేనే జిల్లాలో కమలం వికసిస్తుంది. కార్యకర్తల ఆవేదనను అధిష్టానం ఇప్పటికైనా గుర్తించాలి. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే ఏకైక లక్ష్యంగా పనిచేయాలి. రాజకీయంగా నష్టపోతున్నామని కార్యకర్తలు చేస్తున్న ఫిర్యాదులపై స్పందించాలి. సరైన నేతలకు బాధ్యతలు అప్పగిస్తేనే పార్టీ ఉనికి కాపాడబడుతుంది. కాషాయ జెండాను జిల్లాలో ఎగురవేయాలంటే శ్రమతో పాటు సమయస్ఫూర్తి కూడా చాలా అవసరం. సమర్థవంతమైన నాయకత్వం వస్తే కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేసే అవకాశం ఉంది. జిల్లా రాజకీయ ముఖచిత్రంలో బీజేపీకి ఉన్న అవకాశాలను వృథా చేసుకోకుండా అడుగులు వేయాలి. అధిష్టానం కళ్ళు తెరిచి నియోజకవర్గాల్లో పట్టు సాధించే దిశగా ప్రణాళికలను అమలు చేయాలి.

# గంజాయి విక్రయదారుడి అరెస్ట్

- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం.. నిందితుడు అదుపులో
- మత్తు పదార్థాల విక్రయాలపై పోలీసులు కఠిన చర్యలు: కురవి ఎస్సై బి. సతీష్



**కురవి విశాలభారతి:** గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని కురవి పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు కురవి ఎస్సై బి. సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, కంకరబోర్డ్, మహబూబాబాద్‌కు చెందిన షేక్ ఇస్మాయిల్ (25) అనే వ్యక్తి ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి మహబూబాబాద్, కురవి మరియు పరిసర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం పోలీసులు ఏరియా పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కురవి ఎస్సై బి. సతీష్ మాట్లాడుతూ, గంజాయి వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఇటువంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యాన్ని మరియు కుటుంబ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. గంజాయి విక్రయాలు, రవాణా మరియు వినియోగంపై ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ కొందరు అక్రమ లాభాల కోసం వాటిని సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. గంజాయి విక్రయాలు మరియు సరఫరాలో పాల్గొనే వారిపై తెలంగాణ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని, ఎంతటి వారైనా చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని, మత్తు పదార్థాలకు బానిసలై జీవితాన్ని అంధకారంలోకి నెట్టుకోవద్దని సూచించారు. సమాజంలో గంజాయి రహిత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సమాచారాన్ని అందించాలని ఎస్సై బి. సతీష్ కోరారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నాటిన మొక్కలు



**జనగాం విశాలభారతి:** ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఉన్న జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కల పెంపకం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి శంకరం. శ్రీదేవి మాట్లాడుతూ, మనం పర్యావరణాన్ని కాపాడితేనే, పర్యావరణం మనలను రక్షిస్తుంది. అని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యం వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సౌరక్షించాలని సూచించారు. ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు కృషి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ధారవత్ భాస్కర్‌ని పరామర్శించిన మాజీ మంత్రి



**డోర్నకల్ విశాలభారతి:** డోర్నకల్ నియోజకవర్గం, కురవి మండలంలోని నారాయణపురం గ్రామ సర్పంచ్ ధారవత్ భాస్కర్, అనారోగ్యంతో హైదరాబాద్‌లోని కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా, నేడు వారిని మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ హాస్పిటల్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా భాస్కర్ గారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న శ్రీమతి సత్యవతి రాథోడ్, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కురవి మండల బీఆర్ఎస్ నాయకులు అల్లూరి వాసు రాజు, అల్లూరి కిషోర్ వర్మ, ధారవత్ రవి తదితరులు పాల్గొన్నారు.

# కురవి వీరభద్రస్వామి దేవస్థానం చైర్మన్‌గా రవీందర్ రెడ్డి



**కురవి విశాలభారతి:** కురవి శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం నూతన చైర్మన్‌గా రవీందర్ రెడ్డి శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతో పాటు నూతన పాలక మండలి సభ్యులు కూడా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టీపీసీసీ హెల్త్ వింగ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ వీరన్న నాయక్ నూతన చైర్మన్ రవీందర్ రెడ్డిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా దేవస్థానం పాలక మండలి సభ్యులైన దొంగల జనార్దన్ రెడ్డి, గాడిల బిక్షపతి, సక్ర నాయక్, శ్రీనివాస్‌లను కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కురవి మండల పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం, ఇస్లావత్ సుధాకర్, బండి శ్రీను, నూకల వేణుగోపాల్ రెడ్డి, బాధవత్ రాము నాయక్, సురేందర్ రెడ్డి, ఆలయ ఈఓ రజనీకాంత్, తుకారం, డాక్టర్ కరుణాకర్, నాగన్న, శ్యామల వేణు, శ్రీధర్, దైదా భద్రయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, నూతన చైర్మన్ రవీందర్ రెడ్డి నాయకత్వంలో ఆలయ అభివృద్ధి మరింత వేగవంతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన పాలక మండలి సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

# దళితులమని చిన్న చూపు : జంగిలి సునీత




**మునుగోడు, విశాలభారతి :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా గుండ్లూరి గూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగరవేయలేదన్న ఆరోపణలను సర్పంచ్ జంగిలి సునీత ఖండించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తలపై ఆమె స్పందిస్తూ వాస్తవాలను మీడియా ముందుకు తెచ్చారు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతీయ జెండా ఎగరవేశామని పేర్కొన్నారు. దళిత బిడ్డ అయిన తన భర్త పై కొంతమంది అధికారులు, అధికార పార్టీ నాయకులు కావాలనే అసత్య ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. జెండా ఎగరవేసే సమయంలో చెట్టు కొమ్మ అడ్డుగా రావడం వల్ల దానిని పక్కకు తప్పించే క్రమంలో జరిగిన సంఘటనను కొందరు వక్రీకరించి తప్పుడు ప్రచారం చేశారని ఆమె వివరించారు గ్రామ అభివృద్ధికి ఆటంకం కలిగించే విధంగా గ్రామపంచాయతీ అభివృద్ధినీ అడ్డుకోవాలని ఉద్దేశంతోనే కొంతమంది వ్యక్తులు తమ సొంత రాజకీయ ప్రయోజనాల కోసం ఈ విధమైన తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆమె ప్రకటనలో ఆరోపించారు. ప్రజా ప్రతినిధిగా విధులు నిర్వహిస్తున్న తమపై గౌరవం లేకుండా ఇలా వివక్ష చూపడం తగదని ఆమె అన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఆమె ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# కర్ర మోహన్ రెడ్డికి కాంగ్రెస్ నేతల ఘన నివాళి

**మహబూబాబాద్ విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్ర జనార్దన్ రెడ్డి తండ్రి కర్ర మోహన్ రెడ్డి అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ సందర్భంగా మండలంలోని కోనాపూర్ గ్రామంలో ఆయన భౌతిక కాయానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, తెలంగాణ రాష్ట్ర రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ చల్ల నారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ విజయ్ రూప్‌సింగ్ తదితరులు కర్ర జనార్దన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పిస్తూ మోహన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంజ బిక్షపతి, జిల్లా ఓబీసీ జనరల్ సెక్రటరీ వల్లపు రంజిత్, గ్రామ కమిటీ అధ్యక్షుడు బోల్లం ఐలయ్య, సుభాష్ రెడ్డి, కె. భాస్కర్ రెడ్డి, రాజు, గ్రామ కమిటీ నాయకులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# తెలంగాణ డబ్బులిస్తేనే ఉచిత ఎంఎంటీఎస్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**




హైదరాబాద్ నగరవాసులకు లైఫ్ లైన్‌గా నిలిచే ఎంఎంటీఎస్ రైళ్లలో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలనే తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనకు కేంద్ర రైల్వే బోర్డు ఊహించని విధంగా గట్టి షాక్ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించి, సామాన్యుల ప్రయాణ భారం తగ్గించాలని ఆశించిన ఈ పథకానికి రైల్వే శాఖ తన నిర్ణయాత్మకమైన "నో" చెప్పేసింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఈ ప్రతిపాదనను అమలు చేయడం అసాధ్యమని స్పష్టం చేస్తూ, రైల్వే బోర్డు పంపిన తిరస్కరణ లేఖ నగర ప్రయాణికుల్లో తీవ్ర నిరాశను మిగిల్చింది. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకాన్ని లోకల్ రైళ్లకు కూడా విస్తరించాలని భావించడం వెనుక సామాజిక బాధ్యత ఉన్నప్పటికీ, రైల్వే శాఖ తనదైన ఆర్థిక దృక్పథంతో ఈ అభ్యర్థనను తోసిపుచ్చింది. ఈ ఉచిత ప్రయాణ ప్రతిపాదనను తిరస్కరించడానికి రైల్వే బోర్డు ప్రధానంగా చూపిస్తున్న కారణం ఎంఎంటీఎస్ వ్యవస్థ ఎదుర్కొంటున్న భారీ ఆర్థిక నష్టాలు. ప్రస్తుతం హైదరాబాద్ లోకల్ రైళ్ల నిర్వహణ వల్ల ఏటా దాదాపు 160 కోట్ల రూపాయల మేర నష్టాలు వస్తున్నాయని బోర్డు గణాంకాలతో సహా వెల్లడించింది. ఇప్పటికే సబర్బన్ రైల్వే వ్యవస్థ ఆర్థికంగా కోలుకోలేక సతమతమవుతుండగా, మళ్లీ ఉచిత ప్రయాణాల భారం మోపితే ఈ వ్యవస్థ కుప్పకూలిపోయే ప్రమాదం ఉందని రైల్వే అధికారులు గట్టిగా వాదిస్తున్నారు. కనీస నిర్వహణ ఖర్చులు కూడా వసూలు కాని పరిస్థితుల్లో ఉన్నప్పుడు, ఈ పథకాన్ని ఎలా అమలు చేస్తామని రైల్వే శాఖ ఎదురుప్రశ్న వేస్తోంది. లాభాల మాట పక్కన పెడితే కనీసం నష్టాలను కూడా భరించలేని పరిస్థితిలో ఉన్న ఈ వ్యవస్థపై మరిన్ని ఆర్థిక భారాలను చేర్చడం ఏమాత్రం ఆచరణాత్మకం కాదని వారి అభిప్రాయం. కేవలం ప్రస్తుత నష్టాల విషయంలోనే కాకుండా, గత కొంతకాలంగా తెలంగాణ ప్రభుత్వం నుండి రైల్వే శాఖకు రావాల్సిన పాత బకాయిల అంశాన్ని కూడా ఈ సందర్భంగా బోర్డు చాలా బలంగా ప్రస్తావించింది. ఎంఎంటీఎస్ ఫేజ్ 2 ప్రాజెక్ట్ వ్యయ భాగస్వామ్య ఒప్పందంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నుండి సుమారు 490 కోట్ల రూపాయల నిధులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని రైల్వే బోర్డు గుర్తుచేసింది. ఇప్పటికే కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉండగా, మళ్లీ కొత్తగా ఉచిత ప్రయాణాల భారాన్ని తమపై వేయడం ఏ రకమైన న్యాయమని రైల్వే శాఖ ప్రశ్నిస్తోంది. పాత అప్పులు క్లియర్ చేయకుండా కొత్త పథకాల గురించి మాట్లాడటం సమంజసం కాదని రైల్వే అధికారులు చాలా కఠినంగా స్పష్టం చేశారు. ఈ పరిస్థితి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న ఆర్థికపరమైన గ్యాప్‌ను మరోసారి ఎండగట్టింది. అయితే, ఈ ఉచిత ప్రయాణ పథకం అమలు కావడానికి రైల్వే బోర్డు ఒక స్పష్టమైన కండిషన్ పెట్టింది. ఒకవేళ తెలంగాణ ప్రభుత్వం నిజంగానే మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలనుకుంటే, ఆ కారణంగా రైల్వే శాఖపై పడే ప్రతి రూపాయి ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరించాలని బోర్డు తేల్చిచెప్పింది. అంటే మహిళలు చేసే ఉచిత ప్రయాణాల తాలూకు టికెట్ డబ్బులను సకాలంలో రైల్వేకు రీఇంబర్స్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ మేరకు ఆర్థికపరమైన గ్యారంటీ ఇస్తేనే, ఉచిత ప్రయాణ ప్రతిపాదనను తాము పునఃసమీక్షించే అవకాశం ఉంటుందని రైల్వే బోర్డు తన లేఖలో స్పష్టం చేసింది. ఇది ఒక రకమైన బాల్ ను రాష్ట్ర ప్రభుత్వ కోర్టులోకి నెట్టేయడమే అని చెప్పవచ్చు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం నిధుల కొరతతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. సామాజిక సంక్షేమ పథకాల కోసం నిధులు సర్దుబాటు చేయడమే పెద్ద సవాలుగా మారిన తరుణంలో, రైల్వే కోరుతున్న రీతిలో వందల కోట్ల రూపాయల భారాన్ని భరించేందుకు ప్రభుత్వం సిద్ధపడుతుందా అనేది పెద్ద మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న 490 కోట్ల రూపాయల నిధులను విడుదల చేయడమే భారంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, కొత్తగా ఉచిత ప్రయాణాల భారాన్ని మోసేందుకు ఆర్థిక శాఖ ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి. ఒకవైపు రాజకీయంగా ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలనే ఒత్తిడి, మరోవైపు ఖాళీ అవుతున్న ఖజానా ప్రభుత్వం ముందున్న ప్రధాన సందిగ్ధత. ఈ ఉచిత ప్రయాణ పథకం విషయంలో ప్రభుత్వం ముందుకు వెళ్తుందా లేక వెనక్కి తగ్గుతుందా అనేది వేచి చూడాలి. ఎంఎంటీఎస్ వ్యవస్థ ఇప్పుడు ఉన్న స్థితిలో అదనపు భారాలను భరించడం ఆ వ్యవస్థ మనుగడకే ప్రమాదకరమని రైల్వే బోర్డు భావిస్తోంది. ఉచిత ప్రయాణాల వల్ల రద్దీ పెరుగుతుంది, కానీ ఆదాయం రాదు. పెరిగిన రద్దీకి తగ్గట్టుగా అదనపు సర్వీసులు నడపాల్సి వస్తే, ఆ ఖర్చు ఎవరు భరిస్తారనేది కూడా కీలకమైన ప్రశ్న. ఇప్పటికే పాత బకాయిల విషయంలో రైల్వే మరియు రాష్ట్ర ప్రభుత్వం మధ్య వివాదం నడుస్తుండగా, ఈ ఉచిత ప్రయాణ అంశం ఈ గ్యాప్‌ను మరింత పెంచే అవకాశం ఉంది. రైల్వే శాఖ తన నిబంధనలకు కట్టుబడి ఉండటంతో, బంతి పూర్తిగా తెలంగాణ సర్కార్ కోర్టులోనే ఉంది. ప్రభుత్వం నిధుల సమీకరణ మార్గాలను అన్వేషిస్తూ ఈ ప్రతిపాదనను ఎలా ముందుకు తీసుకెళ్తుందో, రైల్వే శాఖను ఎలా ఒప్పిస్తుందో అనే దానిపైనే ఈ పథకం భవితవ్యం ఆధారపడి ఉంది. చెప్పాలంటే, మహిళల ప్రయాణ సౌకర్యానికి ఉచిత ప్రయాణం మంచి ఆలోచనే అయినా, దాని వెనుక ఉన్న ఆర్థిక వ్యూహాలు స్పష్టంగా ఉండాలి. రైల్వే బోర్డు విధించిన షరతులు ఈ ప్రాజెక్టును మరింత సంక్లిష్టంగా మార్చాయి. రాష్ట్ర ప్రభుత్వం పాత బకాయిలను క్లియర్ చేయకుండా, కొత్త ఆర్థిక భారాన్ని రైల్వేపై వేయడం ఏమాత్రం సాధ్యపడదని రైల్వే శాఖ స్పష్టం చేయడంతో ఈ ప్రతిపాదన ప్రస్తుతం డైలమాలో పడింది. నగర ప్రయాణికులు ఈ పథకం కోసం ఆశగా ఎదురుచూస్తున్న తరుణంలో, ప్రభుత్వం మరియు రైల్వే శాఖ కలిసి కూర్చుని, ఆర్థిక భారాన్ని పంచుకునే ఏదైనా మధ్యేమార్గాన్ని వెతుక్కుంటే తప్ప ఈ ఉచిత ప్రయాణాల కల సాకారం కావడం కష్టమే. ఏది ఏమైనా, హైదరాబాద్ లోకల్ రైళ్ల ప్రయాణం ఉచితం కావాలంటే ముందుగా ఆర్థిక చిక్కుముడులు వీడాల్సిందే.

# జనాభా లెక్కల్లో తప్పుడు వివరాలు

- పేదలకు అన్యాయం, సంక్షేమ పథకాలకు గండి
- ఎల్. విజయ్ కాంత్ బీఎస్పీ జిల్లా అధ్యక్షులు, మహబూబాబాద్

**డోర్నకల్ విశాలభారతి:**




భారతదేశంలో ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జనాభా లెక్కలు దేశ అభివృద్ధికి, సంక్షేమ పథకాల రూపకల్పనకు అత్యంత కీలకమైన ప్రక్రియ. కానీ క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారులు వాస్తవ పరిస్థితులను నమోదు చేయకుండా, ఇళ్లలో మరుగుదొడ్లు లేకపోయినా ఉన్నట్లు, తాగునీటి సౌకర్యాలు లేకపోయినా ఉన్నట్లు, గృహ వసతులు సరిగా లేకపోయినా అన్నీ ఉన్నట్లు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకవేళ జనాభా లెక్కల్లో తప్పుడు వివరాలు నమోదు అయితే, ప్రభుత్వానికి గ్రామాలు, బస్తీలు, పేద కుటుంబాల అసలు పరిస్థితి తెలియదు. ఫలితంగా నిజంగా అవసరమైన ప్రాంతాలకు నిధులు, పథకాలు, మౌలిక సదుపాయాలు చేరకుండా పోతాయి. పేదలకు అందాల్సిన సంక్షేమ ఫలాలు కాగితాలకే పరిమితమవుతాయి. మరుగుదొడ్డి లేని కుటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, రికార్డుల్లో ఉన్నట్లు చూపించడం వల్ల ఆ కుటుంబాలు భవిష్యత్తులో కూడా ఆ సౌకర్యాలకు దూరమవుతాయి. ఇది కేవలం పరిపాలనా లోపం మాత్రమే కాదు, సామాజిక న్యాయానికి విరుద్ధమైన చర్య. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ఉద్దేశించిన పథకాలు తప్పు గణాంకాల కారణంగా లక్ష్యాన్ని కోల్పోతున్నాయి. జనాభా లెక్కలు అనేవి దేశ భవిష్యత్ ప్రణాళికలకు పునాది వంటివి. పునాదే తప్పుగా ఉంటే అభివృద్ధి ప్రణాళికలు కూడా తప్పుదోవ పట్టే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రతి ఇంటి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పూర్తిగా పరిశీలించి, ప్రజల సమక్షంలోనే నిజమైన వివరాలు నమోదు చేయాలి. కేవలం కాగితాలపై గణాంకాలను నింపడం వల్ల ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతింటుంది. కేంద్ర ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు జనాభా లెక్కల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలి. నమోదైన వివరాలను గ్రామ సభలు, వార్డు సభలు లేదా ప్రజా పరిశీలనకు అందుబాటులో ఉంచి అభ్యంతరాలు స్వీకరించే విధానాన్ని అమలు చేయాలి. తప్పుడు సమాచారం నమోదు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. "పేదవాడి ఇంట్లో లేని మరుగుదొడ్డిని కాగితాల్లో ఉన్నట్లు చూపించడం అభివృద్ధి కాదు; అది పేదరికాన్ని దాచిపెట్టే ప్రయత్నం. నిజాలను నమోదు చేసినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది." ఈ కార్యక్రమంలో డోర్నకల్ నియోజకవర్గ ఇన్చార్జి బందెల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హైటెక్స్‌లో 'థ్రెడ్ పోచంపల్లి' ఘన ప్రారంభం




- పోచంపల్లి ఇకత్‌కు అంతర్జాతీయ గుర్తింపు దిశగా అడుగు

**సైబరాబాద్ విశాల భారతి:** తెలంగాణ చేనేత సంప్రదాయానికి ప్రపంచ వేదిక కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన "థ్రెడ్ పోచంపల్లి" ప్రదర్శన హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది.వ్యవసాయ,మార్కెటింగ్, సహకార, చేనేత అండ్ జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, చేనేత కళాకారులు, పరిశ్రమ ప్రముఖులు పాల్గొన్నారు.పోచంపల్లి ఇకత్ కళా వైభవాన్ని జాతీయ, అంతర్జాతీయ వేదికలపై నిలబెట్టడమే "థ్రెడ్ పోచంపల్లి" ప్రధాన లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం, వారి ఉత్పత్తులకు సరైన ధర, మార్కెట్ కల్పించడం ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని స్పష్టం చేశారు.

**100కు పైగా స్టాళ్లు:** ప్రదర్శనలో 100కు పైగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. సంప్రదాయ ఇకత్ చీరలు, ఆధునిక ఫ్యాషన్ దుస్తులు, గృహ అలంకరణ వస్తువులు, జీవనశైలి ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పోచంపల్లి ఇకత్ తయారీ ప్రక్రియను దశలవారీగా వివరించే ప్రత్యేక గ్యాలరీ, వర్చువల్‌గా ఇకత్ దుస్తులు ధరించే ఏఐ బూత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.సందర్శకులు నేరుగా నేత కుటుంబాలతో మాట్లాడి వారి కళ, కష్టాన్ని అర్థం చేసుకునే అవకాశం లభిస్తోంది. ప్రతి ఒక్కరూ చేనేత ఉత్పత్తులు కొనుగోలు చేసి వేలాది నేత కుటుంబాలకు అండగా నిలవాలని మంత్రి పిలుపునిచ్చారు.ప్రదర్శన కొన్ని రోజుల పాటు కొనసాగనుంది. తెలంగాణ చేనేత వైభవాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు, అనుభవించేందుకు హైదరాబాద్, సికింద్రాబాద్, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

# గంజాయి నిర్మూలనపై పోలీసుల అర్ధరాత్రి దాడులు

- బహిరంగ మద్యం సేవిస్తున్న 25 మందిపై కేసులు
- జిల్లాలో కట్టుదిట్టమైన నిఘా : జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్



**మహబూబాబాద్ విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు ఆధ్వర్యంలో టౌన్ సీఐ రఘుపతి రెడ్డి, రూరల్ సీఐ అంజలి, 7 మంది ఎస్ఐలు, 40 మంది పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అర్ధరాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని నిర్మానుష్య ప్రదేశాలు, ఖాళీ మైదానాలు, చెట్ల పొదలు, రైల్వే ట్రాక్ పరిసరాలు, పార్కులు, విద్యాసంస్థల సమీప ప్రాంతాలు, యువకులు గుమిగూడే ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టి గంజాయి వినియోగంపై ఆరా తీశారు. ఈ తనిఖీల సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న 25 మందిపై ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. అలాగే అనుమానాస్పదంగా కనిపించిన 15 మందికి గంజాయి టెస్టింగ్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించగా, అందరి ఫలితాలు నెగెటివ్‌గా వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ మాట్లాడుతూ గంజాయి విక్రయదారులు, సరఫరాదారులు, వినియోగదారులపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు. యువత భవిష్యత్తును దెబ్బతీసే గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని, జిల్లాను పూర్తిగా గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు. గంజాయి విక్రయాలు, రవాణా, నిల్వ లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు, అలాగే గంజాయి అలవాటుతో బాధపడుతున్న వారి కుటుంబ సభ్యులు జిల్లా పోలీసు హెల్ప్‌లైన్ 8712656999కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఎస్పీ స్పష్టం చేశారు.

# ప్రజల వద్దకే పాలన.. ఉపాధి కూలీలతో గ్రామసభ

- గుండంరాజుపల్లిలో ప్రత్యేక కార్యక్రమం.. ఉపాధి కూలీలకు మజ్జిగ, తాగునీటి పంపిణీ
- ఎన్నికల హామీలన్నీ దఫాల వారీగా అమలు చేస్తాం : గునిగంటి కమలాకర్.



**మహబూబాబాద్, విశాలభారతి :** ప్రజల వద్దకే పాలన చేరాలనే లక్ష్యంతో గ్రామసభలను నిర్వహిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా సర్పంచుల ఫోరం కన్వీనర్, గుండంరాజుపల్లి సర్పంచ్ గునిగంటి కమలాకర్ తెలిపారు. జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిన్నగూడూరు మండలం గుండంరాజుపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల ప్రదేశంలో ఆయన ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మమేకమైన కమలాకర్ వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కూలీలకు మజ్జిగ, తాగునీటిని పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు గ్రామ సభలు సమర్థవంతమైన వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీల అమలుకు తాను పూర్తిగా కట్టుబడి ఉన్నానని తెలిపారు. గ్రామాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త పెన్షన్ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా కృషి చేస్తానని అన్నారు. గ్రామ ప్రజల అవసరాలు, ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులను దఫాల వారీగా చేపడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల సహకారంతో గుండంరాజుపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్థులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

# ఆడబిడ్డే మహాలక్ష్మి

**వారి భవిష్యత్తుకు అండగా ఉంటా : సమ్మయ్య గౌడ్**



**మహబూబాబాద్ విశాలభారతి :** ఉప్పరపల్లి గ్రామానికి చెందిన నాలుగో వార్డ్ సభ్యుడు మంద ప్రవీణ్-శ్రావణి దంపతులకు రెండో కాన్పులో ఆడబిడ్డ జన్మించిన సందర్భంగా ప్రముఖ సామాజిక సేవకుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ మహబూబాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో తల్లిబిడ్డలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆడపిల్లలు కుటుంబానికి వరమని, మహాలక్ష్మి స్వరూపాలని పేర్కొన్నారు. ఇప్పటికే కవల ఆడపిల్లలు ఉన్న ఈ కుటుంబానికి మరో ఆడబిడ్డ జన్మించడంతో నిరాశ చెందవద్దని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అవసరమైతే పిల్లల విద్య, భవిష్యత్తు కోసం తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తల్లికి పండ్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపిన సమ్మయ్య గౌడ్, ఆడబిడ్డలకు నాణ్యమైన విద్య అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్‌లో ఎంపికైన కంబాలపల్లి విద్యార్థులు





**మహబూబాబాద్ విశాల భారతి :** కంబాలపల్లి, జూన్ 5: జాతీయ ఉపకార వేతన పథకం (NMMS 2025) పరీక్షలో జడ్పిహెచ్ఎస్ కంబాలపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థులు కొణతం సౌశీల్ రెడ్డి, లింగంపల్లి లక్ష్మిప్రసన్న, సుంకనపెల్లి ప్రసన్నలు ఎంపికై పాఠశాలకు గర్వకారణంగా నిలిచారని ప్రధానోపాధ్యాయులు కె. గిరిజ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను అభినందించిన ఆమె, వారి కృషి, పట్టుదలతో పాటు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు ఉప్పలయ్య, సోహెన్, బి. శ్రీధర్ రెడ్డి, శ్రీనివాసరావు, తిరుపతి, శిభరాణి, సతీష్ కుమార్, సోమేశ్వర్, ఝాన్సీ, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, వీరభద్రం, యుంగేందర్, ఎం. వెంకటేశ్వర్లు, ఎస్. వెంకటేశ్వర్లు అభినందిస్తూ వారి భవిష్యత్తు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పాఠశాల విద్యార్థుల ప్రతిభకు ఈ ఫలితాలు నిదర్శనమని వారు పేర్కొన్నారు.

## మరిపెడలో ఉచిత టీబీ నిర్ధారణ శిబిరం

- **టీబీ నిర్ధారణైతే 6 నెలల ఉచిత చికిత్స**
- **పోషకాహార సహాయం అందజేత: డాక్టర్ గుగులోతు రవి**



**మరిపెడ విశాలభారతి:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీ హెచ్ సీ) పరిధిలో శుక్రవారం ఉచిత టీబీ (క్షయ) వ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో మండలంలోని పలు గ్రామాల నుంచి టీబీ లక్షణాలు ఉన్న వారిని ఆశా కార్యకర్తల సహకారంతో గుర్తించి పరీక్షలకు తీసుకువచ్చారు. శిబిరంలో మొత్తం 34 మంది అనుమానితుల నుంచి నమూనాలను సేకరించినట్లు డాక్టర్ రవి తెలిపారు. సేకరించిన నమూనాలను నిర్ధారణ పరీక్షల కోసం జిల్లా కేంద్రానికి పంపించినట్లు చెప్పారు. టీబీ వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం తరఫున ఆరు నెలల పాటు పూర్తిగా ఉచితంగా మందులు అందించడంతో పాటు పోషకాహార సహాయం కోసం ఆర్థిక ప్రోత్సాహకాన్ని కూడా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని ఆయన పేర్కొన్నారు. టీబీ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఆచార్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు అనిత, అనూష, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య, ఆశా కార్యకర్తలు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బిల్ల పుష్పలీల కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి



**దేవరుప్పుల విశాలభారతి:** మండలం,కామారెడ్డి గూడెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు క్రీ.శే.బిల్ల సోమిరెడ్డి సతీమణి బిల్ల పుష్పలీల(75) మరణించిన విషయం తెలుసుకుని నేడు వారి నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. వారి వెంట బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్,సర్పంచ్ చింత రవి,మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేష్, మాజీ జీసీసీ చైర్మన్ ధారావత్ గాంధీ నాయక్, మండల, గ్రామ బిఆర్ఎస్ నాయకులు, యువజన నాయకులు,వార్డు సభ్యులు, కార్యకర్తలున్నారు.

## రైతుల డీసీసీ బ్యాంక్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలకేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన డీసీసీ బ్యాంకును పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ప్రారంభించారు.రైతులు ఆర్థికంగా ఎదగాలని,రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని,ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతులు రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడులు సాధించారని, రైతులు డీసీసీబీ బ్యాంకులను ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ సీఈఓ వజీర్ సుల్తాన్,డీసీసీ మేనేజర్ చుక్క గణేష్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్,పిఎసిఎస్ చైర్మన్ లింగాల రమేష్ రెడ్డి,జిల్లా నాయకులు కాసారపు ధర్మారెడ్డి, తోటకూరి పాండు కృష్ణ,దేవరుప్పుల, కామారెడ్డి గూడెం సర్పంచ్ లు పెద్ది కృష్ణమూర్తి గౌడ్,చింత రవి, పిఎసిఎస్ డైరెక్టర్ లు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఆర్ఎస్ నాయకులు,ప్రజా ప్రతినిధులు, ఆయా పార్టీల యువజన నాయకులు, రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## పై అధికారి వేధింపులు తట్టుకోలేక కలెక్టరేట్ ఉద్యోగి ఆత్మహత్య



- **బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు : ఇన్స్పెక్టర్ రవికుమార్**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో పనిచేస్తున్న ఓ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి పై అధికారి మానసిక వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదిభట్ల పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయంజాల్ డివిజన్ పరిధిలోని శ్రీరాం నగర్ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీధర్ బాబు (39) రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో గిరిజన సంక్షేమ శాఖలో అవుట్ సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భార్య, ముగ్గురు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్న ఆయన ఈ నెల 1వ తేదీన తన కుమార్తె కళాశాల ప్రవేశం కోసం ఉన్నతాధికారుల అనుమతితో విధుల నుంచి ముందుగానే ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చిన కొద్ది సేపటికే అదే శాఖకు చెందిన లోన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ నాయుడు నుంచి ఫోన్ కాల్ వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఫోన్‌లో మాట్లాడిన అనంతరం శ్రీధర్ బాబు తన గదిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వెల్లడించారు. కొంతసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య సరోజ ఇచ్చిన ఫిర్యాదులో, గత కొంతకాలంగా లోన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ నాయుడు తన భర్తను మానసికంగా వేధిస్తున్నారని, ఆ వేధింపుల కారణంగానే ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

## సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి రూ.1లక్ష విరాళం



**రాజేంద్రనగర్, విశాలభారతి :** కిస్మత్‌పూర్ 122వ డివిజన్ పరిధిలోని ఎర్రకుంట తండా ఇందిరమ్మ కాలనీలో నిర్మాణంలో ఉన్న శ్రీ సేవాలాల్ మహరాజ్ ఆలయానికి బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన బీజేపీ నాయకుడు నీరుడు పవన్ సాయి తన వంతు సహాయంగా రూ.1,00,000 (లక్ష రూపాయలు) విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక విలువల పరిరక్షణకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. సమాజంలో ధార్మిక చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి అందించిన ఈ విరాళంపై ఆలయ కమిటీ సభ్యులు మరియు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, నీరుడు పవన్ సాయికి కృతజ్ఞతలు తెలిపారు.

# సమాజ నిర్మాణంలో యువ న్యాయవాదుల పాత్ర కీలకం

- **న్యాయవ్యవస్థలో మార్పులను అందిపుచ్చుకోవాలి**
- **ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**
- **కోహెడలో 'సాధ్యం లా ప్రొఫెషనల్ అకాడమీ' ప్రారంభం**
- **చదువు వ్యాపారంగా కాకుండా సేవగా ఉండాలని సూచన**



**అబ్దుల్లాపూర్‌మెట్, విశాలభారతి:**

ఆధునిక డిజిటల్ యుగంలో న్యాయవ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులను యువ న్యాయవాదులు అందిపుచ్చుకోవడంతో పాటు నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులు వృత్తి నైపుణ్యాలతో పాటు సామాజిక బాధ్యతను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన సాధ్యం లా ప్రొఫెషనల్ అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అకాడమీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్ రెడ్డి రంగా రెడ్డి మాట్లాడుతూ.. న్యాయరంగం ప్రస్తుతం సాంకేతికతతో ముడిపడి వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. డిజిటల్ కోర్టులు, ఆన్‌లైన్ న్యాయ సేవలు, ఆధునిక పరిశోధనా విధానాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా యువ న్యాయవాదులు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సిద్ధం కావాలని సూచించారు. న్యాయవిద్యలో నాణ్యతను పెంపొందించాలనే లక్ష్యంతో అకాడమీని స్థాపించిన నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. విద్యపై వారి నిబద్ధత, పట్టుదల, దూరదృష్టి అకాడమీలో కల్పించిన సదుపాయాల ద్వారా స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించి సమాజానికి ఉపయోగపడే న్యాయవాదులను తీర్చిదిద్దాలని కోరారు. చదువు ఎప్పుడూ వ్యాపారంగా మారకూడదని, అది సమాజానికి సేవ చేసే ఒక పవిత్ర బాధ్యతగా ఉండాలని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. విద్యా సంస్థలు కేవలం విద్యను అందించడమే కాకుండా విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని కూడా విద్యార్థుల్లో పెంపొందించాలని సూచించారు.భవిష్యత్తులో ఈ అకాడమీ రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే, సంస్థ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు, న్యాయవాదులు, అధ్యాపకులు, విద్యార్థులు, విద్యావేత్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## 7 పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతుల ప్రారంభం

**ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం : ఎంఈఓ జగదీశ్వర్**

విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ : విద్యా సంవత్సరం 202627 నుంచి అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని ఏడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభిస్తున్నట్లు మండల విద్యాధికారి (ఎంఈఓ) జగదీశ్వర్ తెలిపారు. ఈ మేరకు సంబంధిత పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన ఇన్‌స్ట్రక్టర్లు (టీచర్లు), ఆయాల నియామకానికి స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మండల పరిధిలోని కోహెడ, కుంట్లూరు, పెద్ద అంబర్‌పేట్, రాగన్నగూడ, బాటసింగారం, తట్టి అన్నారం, పసుమాముల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభం కానున్నాయని ఎంఈఓ జగదీశ్వర్ తెలిపారు. చిన్నారులకు ప్రాథమిక దశ నుంచే నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఇన్‌స్ట్రక్టర్ మరియు ఆయా పోస్టుల భర్తీకి జూన్ 6 నుంచి జూన్ 10, 2026 వరకు అబ్దుల్లాపూర్ మెట్ లోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల వద్ద దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు ఇంటర్మీడియట్ విద్యార్హతతో పాటు పీటీటీ లేదా డీఈడీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని, ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించినట్లు తెలిపారు. ఎంపికైన ఇన్‌స్ట్రక్టర్లకు నెలకు రూ.8,000, ఆయాలకు నెలకు రూ.6,000 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు ఎంఈఓ జగదీశ్వర్ వెల్లడించారు. స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, ఆసక్తిగల అభ్యర్థులు తమ విద్యార్హతలు మరియు ఇతర సంబంధిత ధ్రువపత్రాలతో నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రీప్రైమరీ విద్యను మరింత బలోపేతం చేయడంతో పాటు చిన్నారుల విద్యాభివృద్ధికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని ఎంఈఓ జగదీశ్వర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## పర్యావరణాన్ని కాపాడుదాం



**మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్**

**సికింద్రాబాద్, విశాలభారతి :**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరిపాలన దిగ్విజయంగా 12 సంవత్సరాలు పూర్తయిన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని, బౌద్ధ నగర్ ఉద్యానవనంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు సాయిప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో ఏక్ పెడ్ మా కే నామ్ మెగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని డివిజన్ బీజేపీ అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ మాట్లాడుతూ..... ప్రతి ఒక్కరూ తమ అమ్మ పేరు మీద ఒక మొక్క నాటి సంరక్షించాలని కోరుతున్నామని. ఇది మాతృమూర్తికి మనం ఇచ్చే నిజమైన గౌరవమని భావి తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించే బాధ్యత" అని ఆమె అన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఐదుగురు కార్యకర్తలు కలిసి 12 మొక్కలు నాటే విధంగా యోజన చేయాలని లబ్ధిదారుల భాగస్వామ్యంతో మొక్కలు నాటే కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసిన వారిని భాగస్వాములను చేయాలని స్వరూప గౌడ్ సూచించారు.పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందారో కనుక్కొని, ఆ మొక్కకు ఆ పథకం పేరు పెట్టాలని స్వరూప గౌడ్ తెలిపారు. పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్ మొదలైనవి. మోదీ 12 ఏళ్ల సుపరిపాలనలో పర్యావరణ పరిరక్షణకు, పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని . ఈ కార్యక్రమం ద్వారా ఆ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని స్వరూప గౌడ్ అన్నారు. కావున డివిజన్ పరిధిలోని బీజేపీ కార్యకర్తలు, అభిమానులు, పర్యావరణ ప్రేమికులు అందరూ ఈ మహా యజ్ఞంలో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ అన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు రవి ప్రసాద్ గౌడ్, కుమార్ వెంకటచైతన్య, భాస్కర్ గౌడ్, డి.రాజు,బిక్షపతి సుబ్బారావు, ప్రభావతి,కే. సుధాకర్ ,సాయి ప్రసాద్,జ్ఞానేశ్వర్, వెంకటేష్ ముదిరాజ్, సాయి,కిరణ్, రూప్ సాయి,రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్ 8వ బెటాలియన్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు




**జోయాలుకాస్ సహకారంతో మొక్కలు నాటిన అధికారులు**

**సైబరాబాద్ - విశాల భారతి**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా జరిగింది. బెటాలియన్ కమాండెంట్ ఎం. రామకృష్ణ ఆధ్వర్యంలో, ప్రముఖ జోయాలుకాస్ జ్యువలరీ సంస్థ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కమాండెంట్ రామకృష్ణ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణానికి మొక్కలే ప్రాణాధారమని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు వి. అనిల్ కుమార్, డి. నరేందర్ రెడ్డి, డి. సత్యనారాయణ, ఎస్. రాంబాబు, ఇతర అధికారులు, సిబ్బంది, జోయాలుకాస్ ప్రతినిధులు పాల్గొని ఉత్సాహంగా మొక్కలు నాటారు.

## పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత


- **చెంగిచెర్లలో మొక్కలు నాటిన బిజెపి నేతలు**
- **పర్యావరణ దినోత్సవ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం**



**బోడుప్పల్, విశాలభారతి:** అంతర్జాతీయ పర్యావరణం దినోత్సవం సందర్భంగా మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ చెంగిచెర్ల డివిజన్ పరిధిలో ఉన్న శివ శక్తి నగర్లో సెలెస్టే ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణంలో బిజెపి చెంగిచెర్ల డివిజన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. మన పర్యావరణన్ని పరిరక్షిద్దాం భవిష్యత్ తరాలను ను కాపాడుకుందాం అనే నినాదంతో ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని నేతలు పిలుపునిచ్చారు. రోజురోజు జనాభా పెరగడంతో నగరాలన్నీ కాంక్రీట్ జంగల్ జంగల్ గా మారి పర్యావరణ మార్పులు సంభవించడం అకాల వర్షాలు, అతివృష్టి అనావృష్టి వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తానాయని, మొక్కలను విరివిగా పెంచడం ఒక్కటే దానికి సరైన మార్గమని, ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఏర్పుల మహేష్ , ప్రధాన కార్యదర్శి తుప్పత్ ఆనంద్ , కన్వీనర్ బజ్జూరి శ్రీనివాస్ గుప్తా, సెక్రటరీ విజయ ,సతీష్, వేణు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## గుడిసెవాసులకు జనగణ చేయాలి

- **సిపిఐ రాష్ట్ర నాయకులు ఆందోజ్ రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి**
- **నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సంపత్ కు వినతి పత్రం**



**అబ్దుల్లాపూర్ మెట్, విశాలభారతి :** అడ్రస్ ప్రూఫ్ తో సంబంధం లేకుండా ప్రతి జీవికి జనాభా లెక్కలు స్థానం ఉన్నట్టుగానే భారత రాజ్యాంగం లో భాగంగా భారత పౌరులైన కుంట్లూరు గ్రామ రెవెన్యూ పరిధిలో భూదాన భూముల్లో గుడిసెలు వేసుకున్న నిరుపేదవారికి ప్రభుత్వ జనాభా గణనలో అవకాశం ఇవ్వాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నాగోల్ సర్కిల్ కమిషనర్ సంపత్ ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది, ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర నాయకులు ఆందోజ్ రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డి, మాజీ కౌన్సిలర్ లక్ష్మణ్ లు మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాలుగా కుంట్లూరు భూదాన భూమిలో గుడిసెలు వేసుకొని అక్కడే నివాస ఉంటున్న ప్రతి వ్యక్తి యొక్క హక్కుగా భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణనలో స్వచ్ఛందంగా తమ వ్యక్తిగత వివరాలను ఎన్యుమరేట్ చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు,లేని పక్షంలో ఎందుకు ఎన్యుమరేట్ చేసుకోరు రాత పూర్వకంగా రాసి ఇవ్వాలని లేదా ఏదైనా ఆర్డర్స్ ఉన్నాయో చెప్పాలని కోరారు, దీనిపైన వేలాదిమంది పబ్లిక్ తో రోజువారి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు, ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సంపత్ అలోచించి నిర్ణయం చెపుతామని అన్నట్టుగా నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూదాన్ నివాసిత ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఏక్ పేడ్ మా కే నామ్



**సికింద్రాబాద్, విశాలభారతి :** బౌద్ధనగర్ డివిజన్ ఎల్. నారాయణ నగర్‌లో ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మేకల హర్షకిరణ్ డివిజన్ నాయకులతో కలిసి మొక్కను నాటడం జరిగింది. మనకు జన్మనిచ్చిన అమ్మను స్మరించుకుంటూ, రాబోయే తరాలకు పచ్చని పర్యావరణాన్ని కానుకగా ఇవ్వడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.ప్రతీ ఒక్కరూ కూడా వారి అమ్మ పేరిట ఒక మొక్క ను నాటాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదమ్మ ,మమత ,ప్రమీల ,శాంతమ్మ ,సావిత్రి ,దేవిక ,పద్మ ,సుమలత, ఇతర డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మారావు



**సికింద్రాబాద్, విశాలభారతి:** పద్మారావు నగర్ లో లక్కీ భాస్కర్ రెస్టారెంట్ ను సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుల్ల పద్మారావు గౌడ్ శుక్రవారం ప్రారంభించారు. నాణ్యత, నవ్యత, రుచి, శుచికి ప్రాముఖ్యతను కల్పించాలని ఈ సందర్భంగా సూచించారు. నిర్వాహకుడు భాస్కర్ రెడ్డి తో పాటు నేతలు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలపై స్పందించిన ఎస్పీ డి. వి శ్రీనివాసరావు

**ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి సమస్యలపై ఆరా**

**విశాలభారతి మెదక్ ప్రతినిధి :** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ శుక్రవారం మెదక్ లోని దయరా పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్నకుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సందీప్‌రెడ్డి, ఎస్ఐ నారాయణతో కలిసి కేంద్రంలోని పరిస్థితులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించేందుకు సరిపడా లారీలు అందుబాటులో లేక కొనుగోలు ప్రక్రియ ఆలస్యమవుతోందని రైతులు ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు బ్లాక్ టార్పాలిన్లు అవసరమని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన ఎస్పీ, జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతులకు అవసరమైన టార్పాలిన్లు, ఇతర సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనికి స్పందించిన అదనపు కలెక్టర్ తక్షణమే అవసరమైన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ధాన్యం రవాణాకు అవసరమైన లారీల కొరతపై కూడా ఎస్పీ స్పందించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని రైతులకు లారీలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డీఎస్పీ ప్రసన్నకుమార్‌ను ఆదేశించారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతుల సంక్షేమానికి జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ సహకారం అందిస్తారని, రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగంతో కలిసి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.

# మీ భద్రతే మా బాధ్యత

- ఒక్క సీసీ కెమెరా వెయ్యి మంది పోలీసులతో సమానం
- ప్రతి పౌరుడు యూనిఫాం లేని పోలీసులా సామాజిక బాధ్యత నిర్వర్తించాలి
- 'మీ సురక్ష' అవగాహన కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య
- నాగోల్‌లో కాలనీ వాసులకు భద్రతా సూచనలు



**అబ్దుల్లాపూర్ మెట్ , విశాలభారతి:** ప్రజల భద్రత కోసం పోలీసులు ఎంత కృషి చేస్తున్నారో, అదే స్థాయిలో పౌరుల సహకారం కూడా అవసరమని ఎల్‌బీనగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) కృష్ణయ్య అన్నారు. ఆధునిక సమాజంలో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు అత్యంత కీలకమని, ఒక్క సీసీ కెమెరా వెయ్యి మంది పోలీసులు చేసే పనిని చేస్తుందని పేర్కొన్నారు. గురువారం సాయంత్రం నాగోల్ పరిధిలోని రోడ్ నంబర్ 3/7లో గల శ్రీ సాయి నగర్ కాలనీ ఓనర్స్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో "మీ సురక్ష" అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ సాయి నగర్ కాలనీ ఓనర్స్ అసోసియేషన్ మరియు నాగోల్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాగోల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సి. మక్బూల్ జానీ, ఎస్ఐ శివనాగ ప్రసాద్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ...అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీల్లో పనిచేసే వాచ్‌మెన్లు, సెక్యూరిటీ గార్డులు, పనిమనుషులు, డ్రైవర్లు, కిరాయిదారుల పూర్తి వివరాలను తప్పనిసరిగా సేకరించి పోలీసుల యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. వారి ఆధార్ కార్డులు, మొబైల్ నంబర్లు, శాశ్వత చిరునామాలు, గత ఉద్యోగ వివరాలు, కుటుంబ నేపథ్యం వంటి సమాచారాన్ని భద్రపరచుకోవాలని చెప్పారు. ఇళ్ల తాళాలు నిర్లక్ష్యంగా ఉంచకూడదని, ఇంటికి వచ్చే మెకానిక్‌లు, డ్రైవర్లు, ఇతర సిబ్బంది విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలనీల్లో ప్రతి వీధి, ప్రధాన కూడళ్లు, అపార్ట్‌మెంట్ ప్రవేశ ద్వారాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించిన ఏసీపీ కృష్ణయ్య, మొబైల్ ఫోన్ యాప్‌లు, ఆన్‌లైన్ పెట్టుబడులు, నకిలీ లింకులు, బ్యాంకు మోసాల ద్వారా అనేక మంది మోసపోతున్నారని హెచ్చరించారు. అత్యాశకు పోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రతి పౌరుడు యూనిఫాం లేని పోలీసుగా భావించి సమాజ రక్షణలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. రోడ్డు ప్రమాదాల సందర్భంలో బాధితులను వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించేందుకు సహకరించాలని, అటువంటి బాధ్యతను నిర్వర్తించిన పౌరులకు జిల్లా కలెక్టర్ ద్వారా రూ.25 వేల నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రం అందజేయబడుతుందని తెలిపారు.నాగోల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సి. మక్బూల్ జానీ మాట్లాడుతూ... కాలనీ సంక్షేమ సంఘాలకు ప్రత్యేక యాప్‌లు అందజేశామని, వాటి ద్వారా వాచ్‌మెన్లు, కిరాయిదారులు, పనిమనుషుల వివరాలను నమోదు చేయాలని కోరారు. సమాజ భద్రతలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ, ఎస్ఐ శివనాగ ప్రసాద్‌లను శ్రీ సాయి నగర్ కాలనీ సలహాదారు భీమిడి వెంకటరెడ్డి, బీజేపీ నాయకుడు అయిలయ్య, బీఆర్ఎస్ నాయకుడు గవ్వ శ్యామ్ సుందర్ రెడ్డి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి నగర్ కాలనీ ఓనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ చిలుక రవీందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మందడి వెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గవ్వ శ్యామ్ సుందర్ రెడ్డి, భీమిడి వెంకటరెడ్డి, శ్రీనివాసాచార్యులు, కె. గోపాల్ రావు, జాయింట్ సెక్రటరీ, కాంగ్రెస్ నాయకురాలు మంజుల రెడ్డి, బండా మల్లారెడ్డి, దేపా మల్లారెడ్డి, కొల్లోజు చంద్రశేఖర్, సుధీర్ రెడ్డి, లాలయ్య గౌడ్, మధుసూదన్ రావు, గణేష్ నగర్ కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ రావు, లలితనగర్, కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీ వాసులు, బీఆర్ఎస్ నాయకులు రేవంత్ గౌడ్, వినయ్ కుమార్, లింగరాజు, శివకృష్ణతో పాటు పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సర్కిల్ 51లో జనాభా లెక్కల పనులపై సమీక్ష

- ఆన్ లైన్ సమస్యలను వెంటనే సరిచేయాలి
- ఖాళీ ఇళ్ల వివరాలు మళ్లీ చెక్ చేయాలని ఆదేశం



**కూకట్ పల్లి విశాల భారతి:** జనాభా లెక్కల సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలని సర్కిల్ ఉప కమిషనర్ ఇ.చాముండేశ్వరి అధికారులకు సూచించారు. ఆల్విన్ కాలనీ సర్కిల్ 51 పరిధిలో జరిగిన సమీక్ష కార్యక్రమంలో ఆమె ఈ మాటలు చెప్పారు.సర్వే యాప్ లో వస్తున్న సమస్యలను గుర్తించి వెంటనే సరిచేయాలని సిబ్బందికి చెప్పారు. సర్వేయర్లు, సూపర్ వైజర్లు కలిసి పని చేస్తే ఇచ్చిన సమయం కంటే ముందే పని పూర్తవుతుందని తెలిపారు. పనిలో ఆలస్యం చేయవద్దని స్పష్టం చేశారు. గణకులు లాక్ చేసిన ఇళ్లు, ఖాళీగా ఉన్న ఇళ్ల వివరాలను అసిస్టెంట్ సెన్సస్ ఛార్జ్ ఆఫీసర్ తో కలిసి టీఐలు, బీసీలు ఫీల్డ్ లో మళ్లీ తనిఖీ చేయాలని ఆదేశించారు. డేటాలో తప్పులు లేకుండా సరిగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెన్సస్ ఛార్జ్ ఆఫీసర్, టీఐలు, బీసీలు, సూపర్ వైజర్లు, గణకులు.తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగు

**రూ. 48 లక్షలతో నూతన పైప్‌లైన్ పనులు.. ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని కిస్మత్‌పూర్ సెక్షన్‌లో త్రాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు కీలకమైన చర్యలు ప్రారంభమయ్యాయి. శివాలయ టెంపుల్ నుంచి హిమగిరి నగర్ రోడ్ నం.07 వరకు కొత్త పైప్‌లైన్ ఏర్పాటు పనులకు రూ. 48 లక్షలు మంజూరు చేయగా, ఈ పనులకు స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పైప్‌లైన్ పూర్తయ్యాక ప్రాంతంలో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ప్రజలకు నిరంతరం పరిశుభ్రమైన, నాణ్యమైన నీటిని అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండబ్ల్యూఎస్,ఎస్‌బీ జనరల్ మేనేజర్ లక్ష్మి, డిప్యూటీ జనరల్ మేనేజర్ జవహర్ అలీ, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి కలెక్టరు అధ్యక్షతన ఎస్ఐఆర్ పై అఖిలపక్ష భేటీ

- ఓటర్ల మ్యాపింగ్, షెడ్యూలు పై రాజకీయ పార్టీలకు వివరణ





**సైబరాబాద్ విశాల భారతి:** రంగారెడ్డి జిల్లా కలెక్టరు అధ్యక్షతన ఎస్ ఐ ఆర్ ఓటర్ల సవరణ కార్యక్రమంపై అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో కలెక్టరు ఎస్ ఐ ఆర్ ప్రక్రియ, ఓటర్ల మ్యాపింగ్, వంశావళి వివరాల సేకరణ, రాబోయే షెడ్యూలు పై అధికారులతో కలిసి రాజకీయ పార్టీలకు అవగాహన కల్పించారు. దృశ్య ప్రదర్శన ద్వారా ఎవరు ఓటరుగా నమోదు అవుతారు అనే అంశాన్ని వివరించారు.పద్దెనిమిది ఏళ్లు నిండిన వారు, ఆ నియోజకవర్గంలో సాధారణ నివాసి, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నవారు ఓటరుగా నమోదుకు అర్హులని అధికారులు తెలిపారు. భారత రాజ్యాంగంలోని మూడు వందల ఇరవై ఆరు అధికరణం, ప్రజా ప్రాతినిధ్య చట్టం వెయ్యి తొమ్మిది వందల యాభైలోని పదహారు, పంతొమ్మిది, ఇరవై సెక్షన్లు, నమోదు నిబంధనలు ఐదు, ఆరు, ఏడు రూళ్ళ ప్రకారం ఓటరు అర్హతలు ఉంటాయని పేర్కొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, ఎటువంటి అపోహలు లేకుండా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల సహకారం కావాలని కలెక్టరు కోరారు. సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారులు, ఆల్విన్ కాలనీ సర్కిల్ ఉప కమిషనర్ ఇ.చాముండేశ్వరి మియాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ డి శశిరేఖ, వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50%రాయితీ

- రంగారెడ్డి డీఈఓ ఉత్తర్వులు



**సైబరాబాద్ విశాల భారతి :** రంగారెడ్డి జిల్లాలోని ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్న జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించాలని టీయూడబ్ల్యూజేఐజేయూ జిల్లా యూనిట్ కోరింది. ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రయివేటు పాఠశాలల ఫీజులు భారంగా ఉన్నాయని జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా నేతృత్వంలోని బృందం శుక్రవారం జిల్లా కలెక్టర్, డీఈఓ దృష్టికి తీసుకెళ్లింది. వినతిపై సానుకూలంగా స్పందించిన డీఈఓ వెంకటేశ్వర్లు 50 శాతం రాయితీ ఇవ్వాలంటూ ఉత్తర్వులు ఇచ్చారు. ఉత్తర్వు కాపీలను డీఈఓ వెంకటేశ్వర్లు జిల్లా అధ్యక్షులు సలీమ్ పాషాకు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా కలెక్టర్ నారాయణ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, డీఈఓ వెంకటేశ్వర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆదేశాలు జిల్లాలోని అన్ని ప్రయివేటు పాఠశాలల్లో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా మండలాల ఎంఈఓలకు సూచనలు చేసి ఉత్తర్వు కాపీలు పంపిస్తామని డీఈఓ తెలిపారు.డీఈఓ నిర్ణయంతో జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మారాటీ రవి, జర్నలిస్ట్ నేతలు కరుణాకర్, భాస్కర్, భార్గవ్, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

## 8న మియాపూర్ వంతెనకు సీఎం శంకుస్థాపన

- రూ. 530 కోట్లతో ఆరు వరుసల బ్రిడ్జి



**సైబరాబాద్ విశాల భారతి :** మియాపూర్ చౌరస్తా నుంచి ఆల్విన్ కాలనీ చౌరస్తా వరకు కొత్త వంతెన నిర్మాణానికి ఈ నెల 8న సోమవారం సాయంత్రం 5 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. మియాపూర్ నుంచి ఆల్విన్ వరకు 1790 మీటర్ల పొడవు, ఆరు వరుసలతో వంతెన నిర్మిస్తారు. హఫీజ్ పేట్ నుంచి మియాపూర్ వరకు, బాచుపల్లి నుంచి ఆల్విన్ వరకు మూడు వరుసల ఉప మార్గాలు ఏర్పాటు చేస్తారు. ఈ పనులన్నింటికీ 530 కోట్ల రూపాయలు ఖర్చవుతుంది. శంకుస్థాపన ఏర్పాట్లను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ సీఎంసీ కమిషనర్ శ్రీజన, జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, ఉప కమిషనర్ బాలకృష్ణలతో కలిసి పరిశీలించారు. ఒకే రోజు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 2 వేల కోట్ల పనులకు శంకుస్థాపన చేయడం చరిత్ర అని పీఏసీ చైర్మన్ గాంధీ అన్నారు. మియాపూర్ వంతెనతో ఈ ప్రాంత ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గి ప్రజలకు మేలు జరుగుతుందన్నారు.

## ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



**రాజేంద్రనగర్, విశాలభారతి :** మణికొండలోని వెంకటేశ్వర కాలనీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ది సిటిజెన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వర కాలనీ నుండి వైయస్సార్ కాలనీకి వెళ్లే 60 ఫీట్ల రోడ్డుపై ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ వి.ఎల్. సుభద్రా దేవి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి కాలనీలోని ఖాళీ స్థలాలు, పార్కుల ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అత్యంత ముఖ్యమని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ది సిటిజెన్ కౌన్సిల్ వ్యవస్థాపకులు ధూళిపాళ సీతారాం, అధ్యక్షుడు బొమ్ము ఉపేంద్ర నాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణరావు, జనరల్ సెక్రటరీ షేక్ ఆరిఫ్, ఈసీ సభ్యులు, కాలనీ ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్ ప్రతినిధులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించి, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**మొయినాబాద్ , విశాలభారతి:** పేద మరియు మధ్యతరగతి కుటుంబాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని చేవెళ్ల ఎమ్మెల్యే శ్రీ కాలే యాదయ్య తెలిపారు.మొయినాబాద్ మున్సిపాలిటీ కేంద్రంలోని రైతు వేదికలో మండలం, మున్సిపాలిటీ పరిధికి చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కాలే యాదయ్య లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా 64 మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రూ.64,01,024 విలువ గల చెక్కులను, అలాగే 22 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.10,60,000 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని తమ కుటుంబాల అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు.ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్న ఆయన, భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో రోడ్డుకు ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎలాంటి భద్రతా చర్యలు లేకుండా ఏర్పాటు చేయబడటంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె, హెచ్చరిక బోర్డులు లేదా ఇతర భద్రతా ఏర్పాట్లు లేకపోవడం ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా పశువులు, చిన్నారులు మరియు పాదచారులు ట్రాన్స్‌ఫార్మర్‌కు అత్యంత సమీపంలో సంచరిస్తుండటంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పశువులు తిరుగుతూ ఉండటం, బహిరంగంగా విద్యుత్ పరికరాలు కనిపించడం వల్ల భద్రతాపరమైన సమస్యలు మరింత పెరిగాయని స్థానికులు చెబుతున్నారు. వర్షాకాలంలో లేదా విద్యుత్ లోపాలు తలెత్తిన సమయంలో ప్రమాదం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



## కోహెడ ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపనకు కట్టుదిట్టమైన బందోబస్తు



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన పోలీసు అధికారులు
- మల్కాజిగిరి సీపీ సుమతి ఆధ్వర్యంలో భారీ భద్రతా వలయం
- వేలాది మంది రైతులు, ప్రజాప్రతినిధుల రాకతో ప్రత్యేక చర్యలు

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాలభారతి:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్మించనున్న ప్రతిష్ఠాత్మక కోహెడ ఫ్రూట్ మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమం నేపథ్యంలో పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టింది. నేడు శనివారం సాయంత్రం 5 గంటలకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన జరగనుండటంతో భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రివర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల నుంచి వేలాది మంది రైతులు, రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ రంగ ప్రతినిధులు హాజరుకానుండటంతో కోహెడ పరిసర ప్రాంతాల్లో విస్తృత భద్రతా చర్యలు చేపట్టారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి ఆదేశాల మేరకు సభా ప్రాంగణం, వీఐపీ మార్గాలు, ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలు, ప్రజల ప్రవేశ ద్వారాలు, ట్రాఫిక్ మార్గాల వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ భద్రతా వలయం కల్పించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు కార్యక్రమ స్థలాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల రాకపోకలు, అత్యవసర సేవలు, భద్రతా తనిఖీలపై అధికారులకు తగిన సూచనలు చేశారు. కోహెడ ఫ్రూట్ మార్కెట్ తెలంగాణ వ్యవసాయ రంగానికి మైలురాయిగా నిలవనున్న నేపథ్యంలో కార్యక్రమం విజయవంతం కావడానికి జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. వేలాది మంది రైతులు పాల్గొనే ఈ చారిత్రాత్మక కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమ ఏర్పాట్ల పరిశీలనలో ఎల్ బి నగర్ డిసిపీ అనురాధ, మనోహర్, వనస్థలిపురం ఏసీపీ కాశీ రెడ్డి , ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య గౌడ్ , హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్లు మాధవరావు,బద్య నాయక్, ప్రియాంక రెడ్డి, వెంకట్ రెడ్డి, లక్ష్మీనారాయణ, నరసింహ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల సిబ్బంది, ప్రత్యేక విభాగాల అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, ఆర్మ్డ్ రిజర్వ్ బలగాలు, మహిళా పోలీసు సిబ్బంది, ఇంటెలిజెన్స్ విభాగ అధికారులు కూడా బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు.

## కానామెట్ ప్రభుత్వ భూముల కబ్జాపై సిపిఐ ఆగ్రహం

- సమగ్ర విచారణ జరపాలని డిమాండ్
- భూ కబ్జాదారులు, అధికారులపై చర్యలకు వినతి



**శేరిలింగంపల్లి తహసీల్దార్ వినతి వినతిపత్రం అందజేస్తున్న సిపిఐ నాయకులు**

**సైబరాబాద్ విశాల భారతి** శేరిలింగంపల్లి మండలం కానామెట్ గ్రామంలో అసైన్డ్, అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూములపై భారీ అక్రమాలు జరుగుతున్నాయని సిపిఐ నాయకులు ఆరోపించారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కాపాడాలని, భూ కబ్జాదారులతో పాటు సహకరిస్తున్న రెవెన్యూ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి. రామకృష్ణ, శేరిలింగంపల్లి నియోజకవర్గ కార్యదర్శి కే. చందు యాదవ్, జిల్లా సమితి సభ్యులు కే. వెంకటస్వామి, ఏఐటియుసి అధ్యక్షులు టి. రాములు, సహాయ కార్యదర్శి జెట్టి శ్రీనివాస్ తదితరులు కానామెట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు.1961 చట్టాల ప్రకారం ఎస్సీ, బీసీ, మైనారిటీ పేద కుటుంబాలకు కేటాయించిన అసైన్డ్ భూములు ప్రస్తుతం భూ మాఫియా చేతుల్లోకి వెళ్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కానామెట్ గ్రామంలోని సర్వే నంబర్లు 41/2, 41/5, 41/7, 41/3, 41/11/ఏ, 60, 46, 64, 58, 50, 59, 43, 45తో పాటు మరికొన్ని సర్వే నంబర్లలో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారని తెలిపారు.ఈ మొత్తం వ్యవహారంలో అమర్నాథ్ రెడ్డి తన అనుచరులతో కలిసి కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా కొంతమంది రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలకు పరోక్షంగా సహకరిస్తూ భారీ ఆర్థిక లాభాలు పొందుతున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయని అన్నారు.సాధారణ పేద ప్రజలకు మాత్రం పీఓటీ చట్టం కింద వెంటనే నోటీసులు జారీ చేస్తున్నారని, ప్రభావశీలులైన భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. చట్టం అందరికీ సమానంగా అమలవ్వాలని, పెద్దలకు ఒక న్యాయం పేదలకు మరో న్యాయం అనే విధానాన్ని సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు.

అమర్నాథ్ రెడ్డి కార్యకలాపాలు కానామెట్‌కే పరిమితం కాకుండా గండిపేట, గోపనపల్లి తదితర ప్రాంతాలకు కూడా విస్తరించాయని స్థానిక ప్రజలు తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. అందువల్ల ఈ వ్యవహారంపై జిల్లా స్థాయి ప్రత్యేక విచారణ కమిటీని ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.ఈ భూ అక్రమాల్లో భారీ ఆర్థిక లావాదేవీలు, అక్రమ ఆస్తుల సృష్టి జరిగిన అనుమానాలు ఉన్నందున ఆదాయపు పన్ను శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వంటి కేంద్ర సంస్థలతో కూడా విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు.

కానామెట్‌లో ప్రభుత్వ భూములను కాపాడాలని, ఇప్పటికే ఆక్రమణకు గురైన భూములను స్వాధీనం చేసుకుని అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని సిపిఐ డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

# పుప్పాలగూడ–ఖాజాగూడలో హైడ్రా భారీ ఆపరేషన్





- రూ. 30 వేల కోట్ల ప్రభుత్వ భూమి
- 250 కోట్ల సంవత్సరాల రాతి వారసత్వానికి రక్షణ

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

పుప్పాలగూడ-ఖాజాగూడ సరిహద్దుల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన హైడ్రా భారీ ఆపరేషన్ రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రకృతి సంరక్షణ, చారిత్రక వారసత్వ రక్షణ అనే ద్వంద లక్ష్యాలతో ఈ చర్యలు చేపట్టడం విశేషం. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలంలోని ఈ ప్రాంతంలో ఉన్న విలువైన ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి రక్షిస్తూ హైడ్రా అధికారులు దాదాపు 200 ఎకరాలకు పైగా భూమిని ఫెన్సింగ్ చేసి పరిరక్షించారు. ఈ భూముల విలువ సుమారు రూ. 30 వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా వేయబడింది. ఈ ప్రాంతం ప్రత్యేకత ఏమిటంటే, ఇక్కడ ఉన్న రాళ్ల గుట్టలు సుమారు 250 కోట్ల సంవత్సరాల చరిత్ర కలిగినవిగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. సహజసిద్ధంగా ఏర్పడిన ఈ గుట్టలు, రాతి నిర్మాణాలు, మధ్యలో పెరిగిన చెట్లు, చిన్న చిన్న గుహలు——అల్ కలిసి ఒక అరుదైన భూభౌతిక వారసత్వంగా నిలిచాయి. ఈ గుట్టలను రక్షించాలనే లక్ష్యంతో "సొసైటీ టు సేవ్ రాక్స్" సంస్థ ప్రతినిధులు దశాబ్దాలుగా పోరాటం కొనసాగిస్తున్నారు. వారు హైకోర్టును ఆశ్రయించగా, 2019లో ప్రభుత్వ శాఖలకు ఈ ప్రాంతాన్ని రక్షించాలని కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే, హద్దులు గుర్తించడం మరియు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంలో ఆలస్యం జరగడంతో కొంతమంది అక్రమంగా భూములను ఆక్రమించే ప్రయత్నాలు జరిగాయి. ఈ విషయాన్ని గమనించిన "సొసైటీ టు సేవ్ రాక్స్" ప్రతినిధులు హైడ్రా ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేయడంతో, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం రెవెన్యూ మరియు మున్సిపల్ శాఖలతో కలిసి సమగ్రంగా సర్వే నిర్వహించి, ప్రభుత్వ భూములను నిర్ధారించి ఫెన్సింగ్ పనులను వేగవంతం చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం, సర్వే నంబర్ 452/1లో 174 ఎకరాలు, 454/1లో 119.05 ఎకరాలు ప్రభుత్వ భూమిగా నమోదయ్యాయి. మొత్తం 293.05 ఎకరాల్లో గతంలో 263.05 ఎకరాలను హెచ్ఎండీఏకు కేటాయించగా, కొన్ని భూభాగాలు ఓవర్‌ల్యాప్ కారణంగా ప్రైవేటు వ్యక్తులకు చెందినవిగా గుర్తించారు. దీంతో చివరకు సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా పరిరక్షించింది. ఈ ప్రాంతంలో దేవాలయాలకు 5 ఎకరాలు, దర్గాకు 5 ఎకరాలు కేటాయించబడినట్లు రికార్డులు సూచిస్తున్నాయి. హైడ్రా చేపట్టిన ఈ చర్యలతో చారిత్రక రాళ్ల గుట్టలు మాత్రమే కాకుండా, ఆ పరిసరాల్లో ఉన్న పర్యావరణ సమతుల్యత కూడా కాపాడబడింది. గతంలో ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొనగా, ఇప్పుడు ఫెన్సింగ్ కారణంగా అవి పూర్తిగా తగ్గిపోతాయని ఆశాభావం వ్యక్తమవుతోంది. పర్యావరణ ప్రేమికులు, భక్తులు, స్థానిక ప్రజలు హైడ్రా చర్యలను ప్రశంసిస్తున్నారు. అదేవిధంగా, ఈ గుట్టలకు ఆనుకుని ఉన్న భగీరథమ్మ చెరువును కూడా హైడ్రా పునరుద్ధరించే పనులు చేపట్టింది. ఒక వైపు ఎత్తైన సహజ కొండలు, మరోవైపు పునరుద్ధరించబడుతున్న చెరువు కలిసివస్తే ఈ ప్రాంతం భవిష్యత్తులో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా చూస్తే, హైడ్రా చేపట్టిన ఈ ఆపరేషన్ కేవలం భూమి రక్షణ మాత్రమే కాకుండా, ప్రకృతి సంపదను, చారిత్రక వారసత్వాన్ని, పర్యావరణ సమతుల్యతను కాపాడే ఒక గొప్ప ప్రయత్నంగా నిలిచింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున ఇలాంటి చర్యలు చేపట్టడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వ నిబద్ధతను మరోసారి చాటిచెప్పింది.

## మున్సిపాలిటీ కన్వీనర్‌గా ఎండీ అన్వార్ ఖాన్ నియామకం



**మొయినాబాద్, విశాలభారతి:** తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మున్సిపాలిటీ కన్వీనర్‌గా ఎండీ అన్వార్ ఖాన్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి తెలిపారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ ఆశీస్సులతో ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అన్వార్ ఖాన్ కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అన్వార్ ఖాన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మొయినాబాద్‌లో పార్టీ జెండాను ప్రజల సహకారంతో మరింత బలోపేతం చేస్తానని అన్నారు.

## గచ్చిబౌలిలో పర్యావరణ దినోత్సవం

- మొక్కలు నాటిన పీఏసీ చైర్మన్ గాంధీ



**సైబరాబాద్ విశాల భారతి:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలి నల్లగండ్ల హుడా కాలనీ విశ్వామిత్ర పార్క్‌లో పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ, సివిల్ కమిషనర్ స్నేహ, అడిషనల్ కమిషనర్ సుబ్రత, జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ మాలెంపాటి, డీసీ సేవా ఇస్లావత్‌లతో కలిసి మొక్కలు నాటారు. "పర్యావరణం కాపాడితేనే భవిష్యత్తు సురక్షితం. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి" అని గాంధీ పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ తగ్గించడం, నీటిని ఆదా చేయడం, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ బయోడైవర్సిటీ అధికారి విక్రమ్, నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు



**అశ్వాపురం, విశాలభారతి :** గోదావరి నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. తెల్లవారుజామున జగ్గారం క్రాస్ రోడ్ సమీపంలో ఇసుకలోడుతో వస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్ ఓనర్లపై కేసులు నమోదు చేసినట్లు సిఐ జి అశోక్ రెడ్డి తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తోలితే సహించబోమని పోలీసులు పట్టుబడితే వారి ట్రాక్టర్ ను సీజ్ చేయడంతోపాటు కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. ఇసుక తరలించే వారికి సంబంధిత శాఖ అధికారుల నుండి తప్పనిసరిగా అనుమతులు ఉండాలన్నారు.

## విశాలభారతి కథనానికి స్పందన..
# సకాలంలోనే ధ్రువీకరణ పత్రాలు



**తహసిల్దార్ సూర్యప్రకాష్**

**అశ్వాపురం, విశాలభారతి :**

మండల రెవెన్యూ కార్యాలయం నుండి మంజూరి చేసే ధ్రువీకరణ పత్రాలన్నీ నిర్ణీత సమయంలో లోపే అంద చేస్తామని తహసిల్దార్ సూర్యప్రకాష్ తెలిపారు. శుక్రవారం విశాల భారతి దినపత్రికలో తహసిల్దార్ కార్యాలయం పై ఎస్బి నజర్' అనే కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. ఈ కథనానికి స్పందించిన తహసిల్దార్ ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ధ్రువీకరణ పత్రాల మంజూరి విషయంపై కూలంకుశంగా మాట్లాడారు. ఇకపై వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం మీ సేవ కేంద్రాలలో దరఖాస్తులు చేసుకునేవారు ఆ ధరకాస్తుకు అవసరమైన అన్ని సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులను జతచేసి ఇవ్వాలన్నారు. మీసేవ నిర్వాహకులు కూడా ధృవీకరణ పత్రాల కోసం దరఖాస్తులు చేసుకునే వారికి జత చేయాల్సిన అన్ని ఆధారాల గురించి వివరించిన తర్వాతనే ధ్రువీకరణ పత్రం కోసం నమోదు చేసుకోవాలన్నారు. అలా నమోదు చేసిన దృవీకరణ పత్రాలను ఆన్లైన్ ద్వారానే పరిశీలించి సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని తహసిల్దార్ తెలిపారు. సర్టిఫికెట్ల కోసం మీ సేవలలో దరఖాస్తులు చేసుకున్న వారు మరల ఆ కాఫీలను పట్టుకొని తహసిల్దార్ కార్యాలయానికి రావలసిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. కొన్ని ధ్రువీకరణ పత్రాలకే కార్యాలయానికి రావాల్సి ఉంటుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తుదారులు చేసుకున్నవారు తిరగాల్సిన అవసరం లేదన్నారు.

**ఎస్సీ సర్టిఫికెట్ల మంజూరి విషయంలోనే కొంత క్షుణ్ణంగా పరిశీలన చేయాల్సి వస్తుంది..**

ఎస్సీ సర్టిఫికెట్ల విషయంలోనే కొంత సమగ్రంగా పరిశీలన చేయాల్సి వస్తుందని తహసిల్దార్ సూర్యప్రకాష్ తెలిపారు. ఈ ధ్రువీకరణ పత్రాలు మంజూరిలో జి పి ఓ లు ప్రత్యేకించి దరఖాస్తు చేసుకున్న వారినీ సమగ్రంగా విచారించాల్సి వస్తుందని, ఇటీవల వర్గీకరణ జరిగిన నేపథ్యంలో దరఖాస్తు చేసుకున్న వారే తమకు కచ్చితంగా ఫలానా కేటగిరి వర్తిస్తుందని అలానే ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని కోరడం జరుగుతుందన్నారు. ఆ క్రమంలోనే కొన్ని ఆధారాలను అడగాల్సి వస్తుందని ఆయన తెలిపారు. అదేవిధంగా ఎస్సీలలోనే కొందరు కన్వర్ట్ క్రిస్టియన్స్ గా మారుతున్నారని, వారికి సర్టిఫికెట్లు జారీ చేయాల్సి వస్తున్న క్రమంలో కూడా కొంచెం సమగ్ర విచారణ చేయాల్సి వస్తుందన్నారు. విద్యా అవసరాలకు ఉపయోగపడే ఏ ఒక్క ధ్రువీకరణ పత్రాన్ని కూడా జాప్యం చేయమని, దరఖాస్తుదారులకు ఏమైనా ఇబ్బందులు కలిగితే నేరుగా తనను సంప్రదించాలని ఆయన తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక కొరత ఉన్న విషయం తన దృష్టికి వచ్చిందని ఈ విషయాన్ని నేనే స్వయంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. కలెక్టర్ కార్యాలయం నుండి ఆదేశాలు వచ్చిన తదుపరి ఇందిరమ్మ ఇండ్లకు అవసరమైన ఇసుకను గోదావరి నుండి తరలించేందుకు చర్యలు చేపడతామన్నారు. సర్టిఫికెట్ల మంజూరీ విషయంలో ఎవరు అపోహలకు గురి కావద్దని దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ లీలావతి, యూ డి సి, జి పి ఓ లు ఉన్నారు.

# విద్యార్థి మృతిపై శ్రీ చైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- కళాశాలల్లో పెరుగుతున్న ఒత్తిడులు, హాస్టళ్లలో వరుస ఘటనలపై ఆందోళన
- విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడంపై విద్యార్థి సంఘాల ఆగ్రహం
- దేవేందర్ రెడ్డి మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్







తమిళనాడులోని కాంచీపురం లో బ్రహ్మానాయుడుని అరెస్టు చేసిన పోలీసులు

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాల భారతి:**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలోని శ్రీ చైతన్య కళాశాల హాస్టల్‌లో ఇంటర్ విద్యార్థి కోమటిరెడ్డి దేవేందర్ రెడ్డి (17) ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థి అనుమానాస్పద పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోవడంతో విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హనుమకొండకు చెందిన దేవేందర్ రెడ్డి ఇంటర్ మొదటి సంవత్సరంలో 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించి ప్రతిభ చాటుకున్నాడు. ఈ నెల 2న తండ్రి జలపతి రెడ్డి కళాశాల హాస్టల్‌లో దించి వెళ్లగా, గురువారం రాత్రి హాస్టల్ గదిలో ఉరివేసుకుని కనిపించడం విషాదానికి దారితీసింది. తోటి విద్యార్థులు గుర్తించి వార్డెన్‌కు సమాచారం ఇవ్వగా, ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థి ఆత్మహత్యకు గల అసలు కారణాలు ఏమిటన్నది విచారణలో తేలాల్సి ఉంది. అయితే ఈ ఘటనపై స్పందించిన విద్యార్థి సంఘాల నాయకులు, పలు ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులపై తీవ్ర విద్యా ఒత్తిడి, కఠిన నిబంధనలు, హాస్టళ్లలో మానసిక ఒత్తిడికి గురిచేసే పరిస్థితులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగినప్పటికీ సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారులు కళాశాలల తనిఖీల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అనుమతులు, నిబంధనల అమలులో పారదర్శకత లేదని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. కళాశాలల నుంచి వచ్చే ప్రభావాలకు అధికారులు లోబడుతున్నారనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నాయి. దేవేందర్ రెడ్డి మృతికి గల కారణాలు పూర్తిస్థాయిలో వెలుగులోకి రావాల్సి ఉన్నప్పటికీ, కళాశాల వాతావరణం, హాస్టల్ నిర్వహణ, విద్యార్థులపై ఉన్న ఒత్తిళ్లు, వార్డెన్ మరియు యాజమాన్యం వ్యవహారశైలిపై కూడా సమగ్ర విచారణ జరపాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. జిల్లా కలెక్టర్, ఉన్నత విద్యాశాఖ అధికారులు, విద్యాశాఖ కమిషనర్ వెంటనే ఈ ఘటనపై ప్రత్యేక దృష్టిసారించి వాస్తవాలను వెలికితీయాలని కోరుతున్నారు. కళాశాలల్లో విద్యార్థుల మానసిక ఆరోగ్యం, భద్రత, హాస్టల్ నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.ఇకపై ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా ప్రైవేట్ విద్యాసంస్థలపై కఠిన పర్యవేక్షణ, అకస్మిక తనిఖీలు, కౌన్సెలింగ్ వ్యవస్థలు తప్పనిసరి చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దేవేందర్ రెడ్డి మృతి ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించడంతో పాటు, ఎవరైనా బాధ్యులుగా తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.




## విశాలభారతి కథనానికి స్పందించిన ఎంపీడీవో ముత్యాలరావు




**అశ్వాపురం, విశాలభారతి :** మండలంలోని అమెర్ధ పంచాయతీలో గల తెల్లంవారి గుంపు గిరిజన గ్రామంలో రక్షిత మంచినీటి ట్యాంక్ పైపులైనుకు వెంటనే గేట్ వాల్ ను తీసుకువచ్చి అమర్చాలని ఎంపీడీవో ముత్యాలరావు పంచాయితీ కార్యదర్శి ని ఆదేశించాడు. శుక్రవారం విశాల భారతి దినపత్రికలో ఆ ట్యాంకుకు అమర్చిన గేట్ వాల్ గేట్ వాల్ ఏమైనట్టు అనే కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. ఈ కథనానికి స్పందించిన ఎంపీడీవో తెల్లం వారి గుంపులోని వాటర్ ట్యాంకు వద్దకు వెళ్లి అక్కడ నెలకొని ఉన్న పరిస్థితిని పరిశీలించారు. పైప్ లైన్ కు రాయి అమర్చి ఉండటం గమనించిన ఆయన వెంటనే గేట్ వాల్ పనులు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ట్యాంక్ పైకెక్కి లోపల ఉన్న పరిస్థితిని పరిశీలించారు. తాగునీటి ట్యాంకుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని, జాప్యం చేస్తే ప్రజలు ఇబ్బందులు గురవుతారన్నారు. ఆయన వెంట కార్యదర్శి కోడి నరేందర్, ఉపసర్పంచ్ అంజిబాబు ఉన్నారు.

## మహావృక్షం వల్ల పొంచి ఉన్న ప్రమాదం

- ఈదురు గాలులకు పడిపోతున్న కొమ్మలు
- పెద్ద కొమ్ములు విరిగి ఇండ్లపై పడుతున్న పరిస్థితి
- గాలి దుమ్ము వస్తుందంటే భయపడుతున్న చుట్టూ ప్రక్కల ప్రజలు
- రానున్న రోజుల్లో విద్యార్థులకు పెను ప్రమాదంగా ఉన్న చెట్టు
- అధికారులు తక్షణమే చెట్టుని తొలగించి ప్రమాదాన్ని నివారించాలి



**భద్రాచలం , విశాలభారతి:** భద్రాచలం రాజుపేట కాలనీలో గిరిజన ప్రాథమిక పాఠశాల ఉన్నది దాని పక్కనే ఎన్నో ఏళ్ల నాటి పెద్ద వృక్షం ఒకటి బడిని ఆనుకొని ఉన్నది. దాని వలన ఇదివరకే పెద్ద పెద్ద కొమ్మలు విరిగి ఇండ్లపైన పడిన సంఘటనలు ఉన్నాయి. ఈ మధ్య అవి ఎక్కువ విరిగి పడుతున్న పరిస్థితి కనిపిస్తుంది. చుట్టుపక్కల ఉన్న స్థానిక ప్రజలు ఆ కొమ్మలు విరిగి పడటం వలన ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో అనే భయంతో ఉంటున్నారు. పెద్ద పెద్ద కొమ్మలు విరిగి పడటం వలన వచ్చి పోయే వాహనదారులకు బాటసారిలకు కూడా పెను ప్రమాదంగా మారిన పరిస్థితి కనిపిస్తుంది. ఇదిలాగే కొనసాగితే ఏదో ఒక రోజు ఆ చెట్టు వలన జరగరాని విపత్తు చోటుచేసుకునే అవకాశం ఉంది. బడులు ప్రారంభం కాకముందే స్థానిక అధికారులు ఆ మహా వృక్షం గా ఉన్న చెట్టుని తొలగించి విద్యార్థుల కు జరగబోయే ప్రమాదాన్ని నివారించాలని అలాగే ఆ చెట్టు కింద చుట్టుపక్కల ఉన్న ఇండ్లకు కూడా ప్రమాదం పొంచి ఉంది. కనుక అధికారులు దీనిని దృష్టిలో పెట్టుకొని ఆ మహా వృక్షాన్ని తొలగించి విద్యార్థులకు ప్రమాదం జరగకుండా చూడాలని స్థానికంగా ఉన్న ప్రజలకు కూడా నష్టం వాటిల్లకుండా తగు చర్యలు చేపట్టాలని మరియు వచ్చి పోయే వాహనదారులకు కూడా గాలి దుమ్ముల వలన అక్కడ ఉన్న చెట్టు కొమ్మలు విరిగి పడటం వలన అనేక స్వల్ప సంఘటనలు చోటు చేసుకున్నాయి. రోడ్లమీద పెద్దపెద్ద కొమ్మలు విరిగి పడటం వలన రాకపోకలు కూడా నిలిచిపోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తక్షణమే సంబంధిత అధికారులు ఆ చెట్టుని నరికించి జరగబోయే ప్రమాదాలను నివారించాలని స్థానిక ప్రజలు విద్యార్థులు అలాగే బాటచారులు అధికారులకు విన్నవిస్తున్నారు.

## పాఠశాల విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెరగాలి

- పర్యావరణ పరిరక్షణకు అవగాహనే తొలి అడుగు
- తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ డా. ప్రియాంకా వర్గీస్







**హైదరాబాద్:** పాఠశాల విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెరగాలని... పర్యావరణ పరిరక్షణకు అవగాహనే తొలి అడుగు అని తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్, సీసీఎఫ్ డా. ప్రియాంకా వర్గీస్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026 సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ (టీజీఎస్ఎఫ్ఏ) ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ, వాతావరణ మార్పులపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (సీసీఎఫ్) డా. ప్రియాంకా వర్గీస్ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడాలంటే చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని అలవర్చుకుని, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026 సందర్భంగా పర్యావరణ అవగాహన వీడియోల ప్రదర్శన, ఉపన్యాస పోటీలు, పాములపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 14 పాఠశాలల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడవులు, వన్య ప్రాణులు, జీవ వైవిధ్యం, ప్రకృతి సమతుల్యత పరిరక్షణ ప్రాధాన్యంపై విద్యార్థులకు వివరించారు. డా. ప్రియాంకా వర్గీస్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కాలుష్యం, జీవ వైవిధ్యం తగ్గిపోవడం వంటి సమస్యలు తీవ్ర సవాళ్లుగా మారాయని అన్నారు. సహజ వనరుల పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు ప్రకృతి సంరక్షణలో ముందుండాలని పిలుపునిచ్చారు. అటవీ అకాడమీ అధ్యాపకులు కూడా విద్యార్థులతో మమేకమై పర్యావరణ విద్య ప్రాముఖ్యతను వివరించారు. పచ్చని, పరిశుభ్రమైన, స్థిరమైన భవిష్యత్తు నిర్మాణంలో పర్యావరణ అవగాహన కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ముగింపులో విద్యార్థులు మొక్కలు నాటడం, నీటిని పొదుపుగా వినియోగించడం, వ్యర్థాలను తగ్గించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వంటి చర్యల ద్వారా ప్రకృతి పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## 7 ఏళ్ల బాలికపై లైంగిక దాడి

**తండ్రీకొడుకులకు యావజ్జీవ కారాగారం .. ఫాస్ట్ ట్రాక్ కోర్టు కీలక తీర్పు**



శివకుమార్ నిందితుడు (ఫైల్ )



శామ్యూల్ నిందితుడు ( ఫైల్ )

**సైబరాబాద్ విశాల భారతి:** మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా పేట్‌బషీరాబాద్ పరిధిలో 7 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన తండ్రీకొడుకులకు ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. నిందితులకు రూ.10 వేల చొప్పున జరిమానా విధించడంతో పాటు, బాధిత బాలికకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ కేసులో కొంపల్లికి చెందిన శివకుమార్, అతని కుమారుడు శామ్యూల్ దోషులుగా తేలారు. వీరిద్దరూ కర్ణాటకలోని గుల్బర్గా స్వస్థలంగా కలిగి కొంపల్లిలో నివాసం ఉంటున్నారు. పోక్సో చట్టం కింద నమోదైన కేసును మేడ్చల్‌లోని రేప్, పోక్సో కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు విచారించింది.

**ఘటన వివరాలు**

బాలిక తల్లిదండ్రులు రోజూ కూలీ పనికి వెళ్లి ఇద్దరు పిల్లలను ఇంటి వద్ద వదిలేవారు. ఒకరోజు తిరిగి వచ్చిన తర్వాత 7 ఏళ్ల కుమార్తె నొప్పితో ఏడుస్తూ ఉండడం, అస్వస్థతతో ఉండడం గమనించారు. తల్లిదండ్రులు ఆరా తీయగా పక్క ఇంట్లో ఉండే శివకుమార్, అతని కుమారుడు శామ్యూల్ తనను ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారని బాలిక తెలిపింది. తల్లిదండ్రులు నిలదీసేందుకు వెళ్లగా నిందితులు పరారయ్యారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు అధికారి శివకుమార్, శామ్యూల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై ఛార్జిషీట్ దాఖలు చేశారు.

**కోర్టు తీర్పు**

కోర్టులో సాక్ష్యాలు, వైద్య నివేదికలు పరిశీలించిన ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ జడ్జి కె. వెంకటేశ్ నిందితులపై వచ్చిన ఆరోపణలు రుజువైనట్లు తీర్పు వెలువరించారు. ఇరువురికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు జరిమానా విధించారు. బాధిత బాలిక పునరావాసం కోసం రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశాలు ఇచ్చారు.సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ ఎ. ముత్యం రెడ్డి కేసు దర్యాప్తులో సమర్థంగా వ్యవహరించిన అధికారులను అభినందించారు. పోక్సో కేసుల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తోందని తెలిపారు.





# కోహెడలో రైతుల కలల సాకారం.. అంతర్జాతీయ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం

- 239 ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద సమీకృత వ్యవసాయ మార్కెట్
- రైతు నుంచి ప్రపంచ మార్కెట్ వరకు ఒకే వేదిక
- తెలంగాణ కీర్తిని ప్రపంచానికి చాటనున్న కోహెడ మెగా ప్రాజెక్ట్
- శనివారం సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన.. భారీగా తరలిరానున్న రైతులు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్:**

దశాబ్దాలుగా రైతులు ఎదురుచూస్తున్న కోహెడ అంతర్జాతీయ సమీకృత వ్యవసాయ మార్కెట్ నిర్మాణానికి ఎట్టకేలకు శ్రీకారం చుట్టబడుతోంది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో 239 ఎకరాల విస్తీర్ణంలో దేశంలోనే అతిపెద్ద అంతర్జాతీయ స్థాయి సమీకృత వ్యవసాయ మార్కెట్‌ను తెలంగాణ ప్రభుత్వం నిర్మించనుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శనివారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం జరగనుంది. వ్యవసాయ రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ మార్కెట్‌ను అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

**వైఎస్సార్ హయాంలో మొదలైన కలకు కాంగ్రెస్ ప్రభుత్వంతో రూపం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలోనే కోహెడ మార్కెట్ కోసం సుమారు 179 ఎకరాల భూమిని కేటాయించారని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. అయితే పలు కారణాలతో ప్రాజెక్టు ముందుకు సాగక రైతుల ఆశలు నెరవేరలేదన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఈ ప్రాజెక్టును పునరుద్ధరించి మొత్తం 239 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని నిర్ణయించారని తెలిపారు. రైతు ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్ కల్పించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమన్నారు.

**దేశవ్యాప్తంగా వ్యవసాయ వాణిజ్యానికి కేంద్రంగా కోహెడ**

కోహెడ మార్కెట్ పూర్తయిన తర్వాత దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశీ మార్కెట్లకు కూడా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులు జరిగే అవకాశాలు విస్తృతంగా పెరుగుతాయని మంత్రి పేర్కొన్నారు. ధాన్యం, పండ్లు, కూరగాయలు, పూలు, పప్పుధాన్యాలు, పశుసంవర్ధక ఉత్పత్తులు, ఆహార ప్రాసెసింగ్ ఉత్పత్తుల విక్రయాలకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయనున్నారు. కోల్డ్ స్టోరేజీలు, గిడ్డంగులు, నాణ్యత పరీక్షా కేంద్రాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, లాజిస్టిక్ హబ్‌లు, డిజిటల్ వేలం కేంద్రాలు, ఎగుమతి టెర్మినల్స్ వంటి సదుపాయాలతో మార్కెట్‌ను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దనున్నారు.

**హైదరాబాద్ అభివృద్ధి కిరీటంలో మరో కలికితురాయి**

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. కోహెడ మార్కెట్ తెలంగాణ రైతాంగానికి వరప్రసాదంగా మారబోతుందని అన్నారు. రైతు పండించిన ప్రతి ఉత్పత్తికి సరైన ధర లభించేలా, ప్రపంచ మార్కెట్లకు నేరుగా అనుసంధానం కల్పించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. రూ.2,200 కోట్లతో నిర్మించనున్న ఈ మార్కెట్ భవిష్యత్తులో దేశంలోనే అతిపెద్ద వ్యవసాయ వాణిజ్య కేంద్రంగా అవతరించనుందని, అవసరమైతే మరిన్ని నిధులు కూడా కేటాయించేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

**అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు**

ముఖ్యమంత్రి పర్యటన, శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. కార్యక్రమ స్థలాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, జిల్లా కలెక్టర్ పి. నారాయణ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు.

**రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి**

రాష్ట్ర రైతాంగ భవిష్యత్తును మార్చే ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. "కోహెడ అంతర్జాతీయ సమీకృత మార్కెట్ కేవలం ఒక నిర్మాణ ప్రాజెక్టు కాదు.. తెలంగాణ రైతు ఆత్మవిశ్వాసానికి, రాష్ట్ర వ్యవసాయ ప్రగతికి, ప్రపంచ వాణిజ్య రంగంలో తెలంగాణ ప్రతిష్ఠకు ప్రతీకగా నిలిచే మహత్తర ప్రాజెక్టు" అని మంత్రి పేర్కొన్నారు.

**కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు**

ఈ కార్యక్రమం ఏర్పాట్ల పరిశీలనలో మరియు సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ పి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్, రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర చారి, డైరెక్టర్లు, ఆర్డీవో, ఎమ్మార్వో, ఎంపీడీవో, రెవెన్యూ శాఖ అధికారులు, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్, వనస్థలిపురం ఏసీపీ, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివచరణ్ రెడ్డి, అబ్దుల్లాపూర్మెట్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు రవీందర్ రెడ్డి, రైతు సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు శేఖర్ మామ, భాస్కర్ యాదవ్, ముద్దగోని రామ్‌మోహన్ గౌడ్, రావుల వెంకటేశ్వర్లు, కొత్త కురుమ శివ, ఫిగ్లీపూర్ గ్రామ సర్పంచ్ కోట ప్రభాకర్ రెడ్డి, మార్కెట్ రైతు సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమకాలిన రాజకీయ అంశాలపై అధ్యయనం చేస్తూ, సుశిక్షితులైన కమ్యూనిస్టులుగా తయారు కావాలి




**సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి**

**విశాల భారతి, రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :**

రోజురోజుకు దేశంలో మారుతున్న సమకాలిన రాజకీయాల పై అధ్యయనం చేస్తూ, సుశిక్షితులైన కమ్యూనిస్టులుగా తయారు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు రాజకీయ శిక్షణా శిబిరాలు దోహద పడతాయని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం వేములవాడ లోని మహనందీశ్వర బాంకెట్ హాలులో మూడు రోజుల పాటు జరిగే కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సిపిఐ కౌన్సిల్ సభ్యుల రాజకీయ శిక్షణా శిబిరం ప్రారంభమయ్యింది. ఈ శిక్షణా శిబిరాల ప్రారంభ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అధ్యక్షత వహించారు. శిక్షణా శిబిరం ప్రారంభ సూచికగా ఏర్పాటు చేసిన సిపిఐ జెండాను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు ఎగురవేశారు. ప్రారంభానికి ముఖ్య అతిథులుగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో, దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను, మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలను అవగాహన చేసుకోవడానికి, రాజకీయ అవగాహన కల్పించుకోవడం కోసం, కార్యకర్తలను నాయకులుగా తీర్చి దిద్దడానికి రాజకీయ శిక్షణా శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ రాజకీయ శిక్షణ శిబిరాలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నిర్వహించాలని రాష్ట్ర పార్టీ నిర్ణయించిందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా సిపిఐ కౌన్సిల్ సభ్యులకు శిక్షణ శిబిరాలు వేములవాడలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోడీ ప్రధానమంత్రిగా, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంలో సామాజిక న్యాయం కొరబడిందని, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కూడు, గుడ్డ, నీడ కూడా కల్పించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని, దేశ సంపదను అందరికీ అందించడం లేదని, పైపై మెరుగులతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ప్రపంచ ధనవంతుల జాబితాలో ఆదాని, అంబానీ లాంటి ఉన్నారని, లక్షల కోట్లకు ఎదుగుతున్నారని, మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పని చేస్తుందన్నారు. 20 కోట్ల మందికి పైగా ఉన్న కార్మికుల హక్కులను కాలరాస్తూ చట్టాలను మారుస్తుందని, ఆయుధాలు హామీ కూలీల పొట్టలు కొట్టేందుకు గతంలో కేంద్రం తొంబై శాతం నిధులు ఇస్తూ రాష్ట్రాలు 10% భరించేవాన్ని కానీ ఇప్పుడు ఆ చట్టంలో మార్పులు తీసుకురావడం మూలంగా కేంద్రం 60% రాష్ట్రాలు 40 శాతం భరించాలని కేంద్రం చెప్పడం చూస్తుంటే దేశంలోని రాష్ట్రాలపై భారం వేస్తూ తిరోగమన పాలన కొని సాగిస్తున్నదని వెంకటరెడ్డి అన్నారు. సంఘ్ పరివార్ శక్తుల కనుసన్నల్లో, మతోన్మాద ముసుగులో ఎన్డీఏ భాగస్వాముల కలయికతో తెలంగాణ రాష్ట్రంలో అడుగు పెట్టాలని చూస్తోందని అందుకు పావుగా జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ను ఉపయోగించుకుంటుందని అన్నారు. రెండు రాష్ట్రాలుగా విడిపోయినా ప్రజల మధ్య ఎలాంటి వైశాల్యాలు వైరుధ్యాలు లేవని పవన్ కళ్యాణ్ లాంటి వారు రెండు రాష్ట్రాల మధ్య అగాధం సృష్టించడానికి పూనుకోవడం బాధాకరమని, రాష్ట్రాల విభజన సమయంలో పార్లమెంటు డోర్లు పెట్టి విభజన చేశారని మోడీ వ్యాఖ్యలను పవన్ కళ్యాణ్ కూడా అదే వాక్యాలు చేయడం, తెలంగాణ మీ జాగీరా అని వ్యాఖ్యానించడం తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పరిధాన్యం కొనుగోలులో జాప్యం జరగడం మూలంగా రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, కల్లాల్లో వరి ధాన్యానికి నిప్పు పెట్టుకునే పరిస్థితి ఏర్పడిందని, కేంద్రం గతంలో ఎఫ్ సీ ఐ ద్వారా ధాన్యం కొనుగోలు చేసేదని ఇప్పుడు అంటి ముట్టనట్టుగా వ్యవహరిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని రైతుల ధాన్యం కొనుగోలు చేయాలని వెంకట రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సిపిఐ కార్యదర్శులు పంజాల శ్రీనివాస్, తాండ్ర సదానందం, మంద సుదర్శన్, చెన్న విశ్వనాథం, సిరిసిల్ల జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు, సిపిఐ వేములవాడ నియోజక వర్గ ఇంచార్జీ కడారి రాములు, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, పట్టణ కార్యదర్శి ఎల్ల దేవరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, సోమ నాగరాజు, మీసం లక్ష్మణ్ , కె.వి.అనసూయ తదితరులు పాల్గొన్నారు. మొదటిరోజు జరిగిన ఈ శిక్షణ శిబిరాల్లో తక్కళ్ళపల్లి శ్రీనివాస్ రావు, మధూకర్, బీఎస్ మోహన్ రెడ్డి క్లాస్ బోధించారు.

# ప్రైవేటు పాఠశాలల కట్టడితోనే ప్రభుత్వ పాఠశాలలకు అడ్మిషన్లు

- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు విద్యాలయాలు
- అర్హత లేని వారితో విద్యాబోధన
- వేలల్లో ఫీజులు గుంజుతున్న వైనం




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాల భారతి :**

విద్యాదానం మహాదానం అన్నారు. విద్యను పదిమందికి పంచితే అది మహావృక్షంలా మారి భావితరాల వారి భవిష్యత్తును మార్చేస్తుందని జ్ఞానులు చెప్పకనే చెప్పారు. కానీ నేడు విద్య విషయంలో జరుగుతున్నది ఏమిటి ? పదిమందికి అక్షర జ్ఞానాన్ని పెంపొందించాల్సిన వారు ఆ విషయాన్ని మరిచి విద్యను వ్యాపారంగా చేసుకుని కోట్లాది రూపాయలు గడిస్తున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలకు ఓ పక్కన ప్రభుత్వాలే అనుమతిలిస్తూ మరో పక్కన ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశాలు ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందని విద్యావేత్తలు అంటున్నారు. పినపాక నియోజకవర్గం లో రోజురోజుకు నూతన విద్యాసంస్థలు పుట్టుకొస్తూనే ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతమైనప్పటికీ గిరిజనులను సొసైటీలుగా చేసుకుని వారి పేరుతో ప్రైవేటు విద్యాసంస్థలను నడుపుతూ పేదా, ధనికా అని తేడా లేకుండా విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి వేలాది రూపాయల ఫీజులు గుంజుతూ కోట్లు కూడ పెట్టుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుండి అధిక మొత్తంలో ఫీజులు గుంజుతూ విద్యా వ్యవస్థను బ్రష్టు పట్టిస్తున్నారని కొందరు విద్యావేత్తలు అంటున్నారు.

**ప్రైవేటు పాఠశాలలలో విద్యార్థులు ఫుల్..... ప్రభుత్వ పాఠశాలల్లో నిల్ :**

ప్రైవేట్ విద్యాసంస్థల మోసానికి నిరుపేద కుటుంబాలు బలవుతున్నాయి. వేసవి సెలవుల అనంతరం నూతనంగా విద్యార్థులను చేర్చుకునేందుకు అడ్మిషన్ల కొరకు గ్రామాల్లో కలియ తిరుగుతున్న ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయులు, సిబ్బంది వారి వారి ప్రైవేట్ పాఠశాలల గురించి ఏజెన్సీ ప్రాంతాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులకు అనేక గొప్ప గొప్ప మాటలు చెప్పి విద్యార్థులను చేర్పించుకున్న తర్వాత ల్యాబ్, గ్రంథాలయం, ఎగ్జామ్, క్రీడలు, ఐడి కార్డు యూనిఫారం, డైరీ లతో పాటు వారి వద్దనే పాఠ్యపుస్తకాలు కూడా కొనాలని నిబంధన పెట్టి వేలాది రూపాయలు నిరుపేదల నుంచి గుంజుతున్నారు. అంతేకాకుండా అర్హత లేని వారితో విద్యాబోధన చేయిస్తూ వారికి కూడా అరకుర వేతనాలు ఇస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. అయినా సరే ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య విరీతంగా పెరుగుతుంటే ప్రభుత్వ పాఠశాలలు మాత్రం ఏడాదికేడాది విద్యార్థులు లేక ఎంతోమంది అర్హత కలిగిన ప్రభుత్వ ఉపాధ్యాయులు రెండు అంకెల విద్యార్థుల సంఖ్య తోనే పాఠ్యాంశాలు బోధించే దయానియస్థితికి ప్రభుత్వ పాఠశాలలు చేరుతున్నాయని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల నిర్వహణ తీరుపై దృష్టిసారించి నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న పాఠశాలలను రద్దుచేసి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు పెరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

## నర్సరీకే రూ. 30 వేల ఫీజు

నియోజకవర్గంలోని కొంతమంది చిన్నారుల తల్లిదండ్రులు ప్రైవేటు విద్యాసంస్థల మోజులో పడి పట్టుమని నాలుగేళ్లయిన నిండకుండానే వారిని ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తూ నర్సరీ దశలోనే వారికి ఒక్కవిద్యా సంవత్సరానికి రూ. 30 వేల వరకు ఫీజులు చెల్లిస్తున్నారు. పాలు మరవని పసిపిల్లల చదువులకే అంత వసూలు చేస్తే ఇక ఒకటి నుండి 10వ తరగతి ముగిసే వరకు ఎంతవరకు వసూలు చేస్తారన్నది చెప్పాల్సిన అవసరం లేదని పలువురు అంటున్నారు. అయితే ప్రభుత్వాలు మాత్రం ప్రైవేటు విద్యాసంస్థలకు అనుమతులు ఇస్తున్నప్పటికీ అలా అనుమతి పొందిన ప్రైవేటు విద్యాసంస్థలను కట్టడి చేయడంలో ఘోరంగా విఫలమవుతున్నాయని ప్రజలు నిర్మొహమాటంగానే అంటున్నారు. సొసైటీలకు అనుమతులు తీసుకుంటున్న సందర్భంలో ప్రభుత్వం విధించిన నిబంధనలకు లోబడి పాఠశాలలు నడుపుతామని అనుమతులు పొందిన వారు పాఠశాలలు పెట్టిన తర్వాత ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ధనార్జనే ధ్యేయంగా విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుండి వేలాది రూపాయలను ముక్కుపిండి వసూలు చేస్తున్నారన్నది అక్షర సత్యం.

# ప్రతి ఒక్కరు "అమ్మ పేరు"తో మొక్కను నాటండి

**విశాల భారతి, ఇందూరు :**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు ప్రతి ఒక్కరు అమ్మ పేరుతో మొక్కలు నాటాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా పిలుపునిచ్చారు. ప్రధానిగా మోదీ 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటడం అంటే రాబోయే తరాలకు ఇచ్చే గొప్ప ఆస్తి అని చెప్పారు. మొక్కలు నాటడం వల్ల ఆక్సిజన్ పుష్టిగా లభిస్తుంది అన్నారు. పర్యావరణాన్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందని గుర్తు చేశారు. మిషన్ లైఫ్ పేరుతో ప్లాస్టిక్ వాడకం తగ్గించడం, నీటి సంరక్షణ పై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పాఠశాలలు కళాశాలలో ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటడం విరివిగా కొనసాగుతుందన్నారు. ప్రధాని మోదీ ఇటీవల ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగించాలని పిలుపునివ్వడం జరిగిందని గుర్తు చేశారు. ఇప్పటికే అనేకమంది మోదీ పిలుపును పాటిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగమోహన్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, కార్పొరేటర్ లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, డాక్టర్ హరీష్‌స్వామి, డాక్టర్ రాఘవేంద్ర చిద్రావార్, నాయకులు మాయావార్ కృష్ణ, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# అదే అలవాటుగా మారింది

వింత పోకడలు, విచిత్రమైన అభిరుచులు మనుషుల్లో కామన్. బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ ఆహారపు అలవాట్లు వింటే మరీ విడ్డూరం అనిపించక మానదు. ఈ ముద్దుగుమ్మ అన్నంలో ఐస్‌క్రీమ్ కలుపుకొని తింటుందట. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని తానే స్వయంగా చెప్పింది. 'ఈ అలవాటు నా ఫ్రెండ్ నుంచి నాకు వచ్చింది. తను ఓ సారి రైస్‌లో ఐస్‌క్రీమ్ కలుపుకొని తినడం చూశాను. చూసిన దాన్ని చూసినట్టుగా ఉండక, ఇంటికెళ్లి ట్రై చేశాను. నిజం చెబుతున్నాను.. ఆ టేస్ట్ చాలా కొత్తగా అనిపించింది. నిదానంగా అది అలవాటుగా మారింది. నాకు నచ్చిందని అందరికీ నచ్చాలని లేదు' అంటూ చెప్పకొచ్చింది మృణాల్ ఠాకూర్. ఇది విన్నవారంతా 'అన్నంలో ఐస్‌క్రీమ్ కలుపుకొని తినడమేంటి?.. పిచ్చికాకపోతే..' అంటూ కామెంట్లు పెడుతున్నారు. కొందరైతే.. 'ట్రై చేస్తే తప్పేంటి?' అని కూడా అంటున్నారు. జిహ్వాకో రుచి, పుర్రెకో బుద్ధి అని ఊరికే అనలేదు!

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.